తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

మంగళవారం

27 అక్టోబర్ 2026

పేజీలు : 08





Follow :




# నాలుగు నెలలుగా పెండింగ్

## మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే చెల్లించాలి

- ప్రజావాణిలో కలెక్టర్‌కు మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి వినతి
- నాలుగు నెలలుగా పెండింగ్‌లో చెల్లింపులు
- నిర్వాహకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడి
- 133 అర్జీలు స్వీకరణ.. తక్షణ పరిష్కారానికి అదనపు కలెక్టర్ ఆదేశాలు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, అక్టోబర్ 26 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్న నిర్వాహకులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి కోరారు. సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బిల్లులు సకాలంలో అందకపోవడంతో నిత్యావసర సరుకుల కొనుగోలు, రోజువారీ ఖర్చుల నిర్వహణలో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సాధారణ, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు ఆర్థిక భారంతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే మధ్యాహ్న భోజన పథకం సజావుగా కొనసాగాలంటే నిర్వాహకులకు బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరారు. ఉమ్మడి కీసర మండల పరిధిలో పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల బిల్లులను వెంటనే విడుదల చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా, ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను ఎలాంటి ఆలస్యం లేకుండా నిబంధనల ప్రకారం పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 133 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యమిస్తూ వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# పార్కు స్థలంలో బోరు పనులు నిలిపివేత

- జనం సాక్షి కథనంతో స్పందించిన అధికారులు
- తిరుమల హిల్స్‌లో 6,054 గజాల స్థలంపై వివాదం
- ప్రభుత్వ భూమిలో నిర్మాణ అనుమతులెలా?
- టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై కాలనీవాసుల ఆగ్రహం





ప్రభుత్వ భూములు, పార్కు స్థలాలపై కబ్జాదారుల కన్ను!

అధికారుల అండదండలతోనే ఆక్రమణల యత్నాలా?

తిరుమల హిల్స్‌లో పార్కు స్థలంలో బోరు వేయడంపై స్థానికుల ఆగ్రహం

26 Oct 2026 - Page 5


లోపలి పేజీలో






# ఎర్రజెండా దివిటీలు... అమరత్వాన అజరామరులు

ఏ నేల మీదైతే అణచివేత పెరిగి పెద్దదవుతుందో... అదే నేల మీద తిరుగుబాటు పూలై వీరులు వికసిస్తారు. పేదల ఆకలి కేకల నుంచి, భూమి కోసం అభాగ్యులు చిందించిన చెమట చుక్కల నుంచి పుట్టుకొచ్చిన విప్లవ దివిటీలు కామ్రేడ్ పాషా, కామ్రేడ్ నరహరి. తెలంగాణ మట్టిలో నాటుకున్న కమ్యూనిజం చెట్టుకు తమ రక్తంతో నీళ్లు పోసి, పీడిత ప్రజల విముక్తి కోసం ప్రాణాలను నైవేద్యంగా అర్పించిన అమరవీరులు వీరు.

**రంగారెడ్డి, అక్టోబర్ 26 (జనంసాక్షి):**




లోపలి పేజీలో


- ప్రజా పోరాటాల మహాయోధులు
- కామ్రేడ్ పాషా, నరహరి
- నేటికి వారు దూరమై 37 ఏండ్లు
- జిల్లా వ్యాప్తంగా వర్ధంతి సభకు
- స్వగ్రామం జాపాలలో సిద్ధమవుతున్న స్మారక చిహ్నం
- ఈ నెల 31న ఆవిష్కరణకు సిద్ధం
- హాజరు కానున్న సీపీఎం జాతీయ కార్యదర్శి ఎంఏ బేబి

# ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ ఉద్యమం

- రంగరాజన్ మోహన్ కుమార మంగళం డిమాండ్ చేశారు
- ఓట్ల తొలగింపుపై సమగ్ర విచారణ జరపాలి
- నవంబర్ 1న ఢిల్లీ సభను విజయవంతం చేయాలి : తోటకూర వజ్రేష్




లోపలి పేజీలో

## అల్వాల్ ప్రజావాణిలో కాలనీల సమస్యలపై వినతులు



**అల్వాల్, అక్టోబరు 26 (జనంసాక్షి):** నాలా నిర్మాణ పనుల తీరులో మార్పులు చేయాలని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని కోరుతూ ఓల్డ్ అల్వాల్ సాయిదుర్గ, పంచశీల కాలనీల వాసులు సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. సాయిదుర్గ కాలనీ సమీపంలో చిన్న రాయుడు చెరువు తూము నుంచి నీరు బయటకు వెళ్లే మార్గానికి అనుగుణంగా కాకుండా, నాలాకు అనేక మలుపులు ఇస్తూ నిర్మాణం చేపడుతున్నారని కాలనీవాసులు పేర్కొన్నారు. దీనివల్ల ప్రజలకు ఇబ్బందులు కలగడంతో పాటు ప్రజాధనం దుర్వినియోగమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పంచశీల కాలనీలో అంతర్గత రహదారులు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, వీధికుక్కల బెడద వంటి సమస్యలను పరిష్కరించాలని కాలనీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గౌరీ శంకర్, భీమావుతో పాటు పంచశీల కాలనీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ భరత్ రెడ్డి, విజయ వర్ధన్ రెడ్డి, ఇంద్రసేనా చారి, మధుసూదన్ రెడ్డి, రామకృష్ణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**కోట్‌పల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి):** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలంలోని జడ్పీహెచ్ఎస్ కోట్‌పల్లి పాఠశాలలో ఒక స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ (గెస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్) పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా బి.ఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ అర్హత కలిగి ఉండాలి. ఎంపికైన అభ్యర్థులకు నవంబర్ 2026 నుంచి మార్చి 2027 వరకు ఐదు నెలల పాటు తాత్కాలిక ప్రాతిపదికన విధులు నిర్వహించే అవకాశం కల్పించనున్నారు. నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లించనున్నారు. అర్హత కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలు, స్పెషల్ బి.ఎడ్ సర్టిఫికెట్‌తో పాటు ఇతర సంబంధిత పత్రాలను జతచేసి అక్టోబర్ 31, 2026లోపు దరఖాస్తు సమర్పించాలి. మరిన్ని వివరాల కోసం దేవయ్యను 7032566911 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ నియామకం సంబంధిత అధికారుల మార్గదర్శకాలకు అనుగుణంగా తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టనున్నారు.

## స్వీపర్లను, వాటర్ మెన్‌లను ఫ్లెక్సీలో ముద్రించి గౌరవించిన మేడిపల్లి నక్కర్త సర్పంచ్

### ప్రశంసలు కురిపిస్తున్న ప్రజలు



**యాచారం, అక్టోబర్ 26(జనం సాక్షి )** దసరా పండుగ సందర్భంగా మండల పరిధిలోని మేడి పల్లి నక్కర్త గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన ఒక ఫ్లెక్సీ ప్రస్తుతం మండల వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గ్రామ సర్పంచ్ శ్రీమతి ముచర్ల సుగుణ సంపత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలో సాధారణంగా ఉండే ప్రజాప్రతినిధులతో పాటు గ్రామానికి నిరంతరం సేవలందించే గ్రామ పంచాయతీ సఫాయి సిబ్బంది, వాటర్ మెన్‌ల ఫోటోలను కూడా ప్రత్యేకంగా ముద్రించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే సఫాయి సిబ్బందికి, ఊరందరికీ నీళ్లందించే వాటర్ మెన్‌లకు కూడా ఫ్లెక్సీలో చోటు కల్పించి గౌరవించడం చాలా గొప్ప విషయమని స్థానికులు కొనియాడు తున్నారు. కానీ, రాత్రింబవళ్లు కష్టపడే పంచాయతీ సిబ్బందిని ఇలా ప్రత్యేకంగా ఫ్లెక్సీ వేసి గౌరవించడం ఎక్కడా చూడలేదు" అని గ్రామస్థులు మరియు ఈ దారిలో వెళ్లేవారు చర్చించుకుంటూ సర్పంచ్ ముచర్ల సుగుణ సంపత్ దంపతులను, పాలకవర్గాన్ని అభినందిస్తున్నారు. శ్రమను గుర్తించి, కష్టపడే సిబ్బందిని సమాజంలో భాగస్వాములను చేస్తూ గౌరవించిన ఈ సంఘటన ఇతర గ్రామ పంచాయతీలకు కూడా ఆదర్శంగా నిలుస్తోంది.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

### జవహర్‌నగర్‌లో లేబర్ ఆఫీస్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

### తోటకూర వజ్రేష్ యాదవ్‌కు వినతిపత్రం అందించిన కార్మిక సంఘం నాయకులు



**జవహర్‌నగర్, అక్టోబర్ 26 (జనంసాక్షి):** జవహర్‌నగర్, చంద్రాపురి డివిజన్ల పరిధిలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు, లేబర్ ఆఫీస్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్‌తో కలిసి వజ్రేష్ యాదవ్‌ను కలిసిన భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ సభ్యులు, లేబర్ ఆఫీస్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రోజువారీ కూలీలు అడ్డా వద్ద ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని నాయకులు కోరారు. కార్మికులకు అందుబాటులో లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ప్రయోజనాలు పొందేందుకు మరింత సౌలభ్యం కలుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్‌కు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు కొయ్యడ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, ఉపాధ్యక్షుడు రమణ రెడ్డి, సలహాదారుడు కొయ్యడ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### అన్ని డివిజన్లలో నీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలపై జలమండలి అధికారులతో సమీక్ష

### పెండింగ్ పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచన



**ఉప్పల్, అక్టోబర్ 26 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో తాగునీటి సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన నీటి సరఫరా అందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలు, పైప్‌లైన్ లీకేజీలు, కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు, పెండింగ్ పనుల పురోగతిపై జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను సమీక్షించారు. కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాలో ఎదురవుతున్న అంతరాయాలు, పైప్‌లైన్ లీకేజీలు, డ్రైనేజీ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. అలాగే నియోజకవర్గ పరిధిలో జలమండలికి సంబంధించిన పెండింగ్ పనుల వివరాలను సమీక్షిస్తూ, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల తీవ్రతను గుర్తించాలని, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కార చర్యలు చేపట్టాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో పైప్‌లైన్ల మరమ్మతులు, కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు వంటి పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరచడంతో పాటు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు నిరంతరాయంగా తాగునీటి సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

# ప్రభుత్వం రైతులను చిత్త శుద్ధితో ఆదుకోవాలి

### భారతీయ కిసాన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి



**శామీర్ పేట్, అక్టోబర్ 26(జనం సాక్షి )**భారతీయ కిసాన్ సంగ్ మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో శామీర్ పేట్,మూడు చింతలపల్లి తాహాసిల్దార్లను సోమవారం రోజు కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూవినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం ఏర్పడక ముందు వరంగల్లో డిక్లరేషన్ చేసి వాగ్దానాలంటిని అమలుపరుస్తామని ప్రమాణం చేసి అధికారంలో వచ్చి మూడు సంవత్సరాలు అయినప్పటికీ వాటిని తుంగలో తొక్కడం శోచనీయమన్నారు. నీటమునిచే పద్దతిలో ఏమి చేయలేని పరిస్థితిలో రైతులను ఇబ్బందుల పాలు చేస్తూ ఉన్నారన్నారు. ఈరోజు రాష్ట్రంలో జరిగిన అన్ని తాహసిల్దారుల ముందు ధర్నా కార్యక్రమంలో భాగంగా శామీర్ పేట్,మూడు చింతలపల్లిలో రైతుల డిమాండ్స్ ను తెలియజేస్తున్నామన్నారు.రెండు లక్షల వరకు రుణమాఫీ అర్హులైనరైతులకు వర్తింపజేయాలని, రైతుల పంటలకు పంట బీమా వ్యక్తిగత భీమా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా రైతులు పండించే పంటలకు కావలసిన విద్యుత్తు నాణ్యమైన విద్యుత్తును అందించాలని అది 12 గంటల వరకు తగ్గకుండా ఉండాలని డిమాండ్ చేశారు. రైతులు పంటలు అమ్ముకునే సమయంలో ప్రతి క్వింటాలుకు ఇస్తానన్న 500 రూపాయల బోనస్ ను తప్పకుండా చెల్లించాలని కోరారు. గ్రామీణ భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి 12,000 రూపాయలు చెల్లించాలని రైతు భరోసా 15వేల వరకు పెంచి అమలుపరచాలని కోరారు. వాననకా,చలన నక రాత్రి అనక,పగలనకా రాత్రింబవళ్లు కష్టపడుతున్న రైతును ఆదుకోవా లని రైతు లేనిదే రాజ్యం లేదు రైతు ఇబ్బందికి గురికాకుండా చూడాలని ప్రభుత్వం రైతుల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ ఘనపరిచి రైతాంగాన్ని వ్యవసాయాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్ల విన్నపాన్ని తీసుకున్న తహసిల్దార్లు ప్రభుత్వానికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మేడ్చల్ జిల్లా కిసాన్ సంఘ్ నాయకులు రాజేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి,హరిమోహాన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సిహ్మ రెడ్డి, బలవంత్ రెడ్డి,అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నారం, బార్వాద్‌లో భూ భారతి చట్టంపై గ్రామసభలు

### తహసీల్దార్ ఆనంద్ రావు



**కోటపల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి):** కోటపల్లి మండల పరిధిలోని ఎన్నారం, బార్వాద్ గ్రామాల్లో సోమవారం స్థానిక తహసీల్దార్ ఆనంద్ రావు ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టం, భూ రీ సర్వేకు సంబంధించిన అంశాలపై గ్రామస్తులకు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆనంద్ రావు మాట్లాడుతూ...... గ్రామీణ ప్రాంతాల్లో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపడుతున్న భూ సర్వే రైతులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. భూ సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తేనె రామచంద్రారెడ్డి, ఎన్నారం సర్పంచ్ ఉప్పరి అనిల్ కుమార్, బార్వాద్ సర్పంచ్ ప్రతిభ రమేష్, ఎన్నారం ఉపసర్పంచ్ వీరేందర్ రెడ్డి, ఎన్నారం మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి
- 76 ఫిర్యాదుల స్వీకరణ
- ఎల్-నినో దృష్ట్యా ముందస్తు ప్రణాళికపై సమీక్ష



**రంగారెడ్డి, అక్టోబర్ 26 (జనంసాక్షి):** ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి స్వీకరించే ప్రతి దరఖాస్తుకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి కలెక్టర్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ వారంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 39, ఇతర శాఖలకు సంబంధించి 37 చొప్పున మొత్తం 76 దరఖాస్తులు నమోదైనట్లు తెలిపారు. అదే విధంగా రానున్న రోజుల్లో ఎల్-నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నీటి సరఫరాను పునఃసమీక్షించాలని, పశువులకు తాగునీరు అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో నిరంతరం వైద్య శిబిరాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. రబీలో వేరుశెనగ సాగుపై అవగాహన: వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా రానున్న రబీ సీజన్‌లో వేరుశెనగ సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. కరపత్రాలు, పోస్టర్లు, ఆడియో-వీడియో మాధ్యమాల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ లోడ్, సరఫరా సమస్యలను గుర్తించి తక్షణమే మరమ్మతులు పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు డాక్టర్ కె. కిరణ్మయి, చంద్ర రెడ్డిలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# యాలాల మండలములో కుల సంఘాల రాజకీయ సమీకరణాలు

### అధిక సంఖ్యాక కులాలవారు రాజకీయాలను శాసించాలా

యాలాల అక్టోబర్ 26 ( జనంసాక్షి ) : రాజకీయాలు ప్రజా సమస్యలకు పరిష్కార వేదికగా ఉండాల్సిన చోట, క్రమంగా కుల సమీకరణాల లెక్కలతో కొలవబడుతున్నాయనే చర్చ యాలాల మండలంలో వినిపిస్తోంది. ఒకప్పుడు గ్రామాభివృద్ధి, ప్రజాసేవ, నాయకత్వ సామర్థ్యం వంటి అంశాలు ప్రాధాన్యం పొందితే, ఇప్పుడు అభ్యర్థి వెనుక ఎంత సంఖ్యాబలం ఉంది, ఏ కుల సంఘం అండగా ఉంది అనే లెక్కలు ముందుకు వస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు జరిగే రాజకీయ చర్చల్లో కూడా కుల సమీకరణాల ప్రస్తావన పెరగడం ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అధిక సంఖ్యాక కులాలకు చెందిన వారే రాజకీయ నిర్ణయాలను ప్రభావితం చేయాలా? లేక ప్రజల విశ్వాసం, పనితీరు, నాయకత్వమే ప్రమాణం కావాలా? అనే ప్రశ్నలు స్థానిక స్థాయిలో చర్చకు వస్తున్నాయి.

**అర్హతకు బదులు సంఖ్యాబలమా ?**

ప్రజా జీవితంలో సేవ చేసిన వారైనా, విద్యావంతులైనా, సామాజికంగా మంచి గుర్తింపు సంపాదించిన వారైనా అల్ప సంఖ్యాక కులాలకు చెందిన వారైతే రాజకీయ అవకాశాలు పరిమితమవుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో, సంఖ్యాబలం ఉన్న వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం సహజంగా లభిస్తోందనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి.

**కుల సంఘాలు సామాజిక వేదికలా? రాజకీయ వేదికలా ?**



కుల సంఘాల అసలు లక్ష్యం సామాజిక ఐక్యత, విద్య, ఉపాధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రోత్సహించడం. కానీ కొన్ని సందర్భాల్లో అవే రాజకీయ సమీకరణాల కేంద్రాలుగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎవరు ఏ పదవిలో ఉండాలి? ఎవరికీ టికెట్ రావాలి? వంటి అంశాల్లో కులపరమైన ఒత్తిళ్లు పెరిగితే రాజకీయ పోటీ సమాన స్థాయిలో సాగదనే ఆందోళనలు ఉన్నాయి.

**ప్రజా సమస్యలు వెనక్కి వెళ్లే ప్రమాదం :**

మంచినీరు, సాగునీరు, రోడ్లు, ఉపాధి, విద్య, వైద్యం వంటి ప్రజల అసలు సమస్యలపై చర్చ జరగాల్సిన సమయంలో కుల లెక్కలు ముందుకు రావడం వల్ల అభివృద్ధి అంశాలు వెనుకబడే ప్రమాదం ఉంది. ఎన్నికల సమయంలో మాత్రమే కాదు, పదవుల పంపకాలలో కూడా ఇదే ధోరణి కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని సామాజిక వర్గాలు చెబుతున్నాయి. భవిష్యత్తు రాజకీయాలను కుల, మత సమీకరణాల కోణంలో చూడటం రాబోయే రోజుల్లో విభజనలకు దారితీయొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. కులం కంటే ప్రజా సేవకు,ప్రజాస్వామ్య స్ఫూర్తి బలపడుతుందనే అభిప్రాయం స్థానికంగా వినిపిస్తోంది.

# కోట్ పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

- పోలీసుల విధులు, చట్టాల అమలుపై అవగాహన
- శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రపై వివరణ
- క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలతో మెలగాలని విద్యార్థులకు సూచనలు




**కోట్‌పల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి):** విద్యార్థుల్లో పోలీసు వ్యవస్థపై అవగాహన పెంపొందించడంతో పాటు, చట్టాల పట్ల గౌరవం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అలవర్చే లక్ష్యంతో కోట్‌పల్లి మండలానికి చెందిన విద్యార్థులు సోమవారం కోట్ పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఎస్ఐ మీనాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీసుల విధులు, శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాల అమలు, ప్రజల భద్రతకు పోలీసులు చేపట్టే చర్యల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మీనాక్షి విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే రోజువారీ విధులు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కారానికి తీసుకునే చర్యలు, నేరాల నియంత్రణలో పోలీసుల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడటం, ప్రజలకు రక్షణ కల్పించడం, చట్టాలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం వంటి బాధ్యతలను పోలీసులు నిర్వర్తిస్తారని వివరించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసులను సంప్రదించి తగిన సహాయం పొందవచ్చని తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని, సమయపాలన పాటించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలను గౌరవించాలని ఎస్ఐ సూచించారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు మంచి నడవడికను అలవర్చుకుని బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత ఉంటుందని, చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా అనేక సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు..ప్రస్తుత కాలంలో విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు సమాజంలోని వ్యవస్థలు, చట్టాలు, ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన ఉండటం ఎంతో అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చట్టాల పట్ల గౌరవాన్ని పెంపొందించడంతో పాటు, పోలీసుల పట్ల ఉన్న అపోహలను తొలగించి, పోలీసు శాఖతో ప్రజలకు సత్సంబంధాలు ఏర్పడేందుకు దోహదపడతాయని తెలిపారు.కోట్ పల్లి పోలీస్ స్టేషన్ సందర్శన విద్యార్థులకు ఒక కొత్త అనుభవంగా నిలిచింది. పోలీసుల విధులు, బాధ్యతలు, ప్రజల రక్షణ కోసం వారు చేపట్టే చర్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా విద్యార్థులకు పోలీసు వ్యవస్థపై మరింత అవగాహన ఏర్పడింది. భవిష్యత్తులో విద్యార్థులు క్రమశిక్షణతో, చట్టాలను గౌరవిస్తూ, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## బిజెపి మండల అధ్యక్షుడిగా పాలాది శ్రీనివాస్



**కేశంపేట, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** భారతీయ జనతా పార్టీ మండల నూతన అధ్యక్షుడిగా కొత్తపేట గ్రామానికి చెందిన యువ నాయకులు పాలాది శ్రీనివాస్ గుప్తా నియమితులయ్యారు. శంషాబాద్ లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు పతంగి రాజ్ భూపాల్ గౌడ్ పాలాది శ్రీనివాస్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానన్నారు. బిజెపి నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసి మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పతంగి రాజ్ భూపాల్ గౌడ్, ఎంపీ డీకే అరుణ, సీనియర్ నాయకులు అందె బాబయ్య, శ్రీ వర్ధన్ రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, కక్కునూరి వెంకటేష్ గుప్తా, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ తదితరులకు శ్రీనివాస్ గుప్తా కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యక్తులను చంపొచ్చు.. ఆశయాలను చంపలేరు

**కామ్రేడ్లు పాషా, నరహరి 37వ వర్ధంతి సందర్భంగా సీపీఎం నేతల నివాళులు**



**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 26 (జనం సాక్షి ):**వ్యక్తులను భౌతికంగా చంపగలరేమో కానీ, వారు నమ్మిన ఆశయాలను, ప్రజా ఉద్యమ స్ఫూర్తిని చంపలేరని సీపీఎం నాయకులు గుండె శివకుమార్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలో కామ్రేడ్లు పాషా, నరహరి 37వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు.ఈ సందర్భంగా గుండె శివకుమార్ మాట్లాడుతూ.. భూమి పంపిణీ చేయాలని, కూలి రేట్లు పెంచాలని పాషా, నరహరి నిరంతరం పోరాటాలు చేశారని గుర్తుచేశారు. వారి ఆశయ సాధన కోసం భవిష్యత్తులోనూ ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వర్కల బాలరాజు గౌడ్, ముత్యాలు, జంగయ్య, కృష్ణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదు ఫారాల పంపిణీ

**చేసిన బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి**



**ఖైరతాబాద్, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని సోమాజిగూడ డివిజన్ బీఎస్ మక్తలో అర్హులైన పట్టభద్రులకు బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి(ఎంజీఆర్) ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైమద్, రజినీకాంత్, ఆనంద్ గౌడ్, శశి రాజ్, సయ్యద్ బాబా, బాబ్బాయి, కన్నా, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్‌కు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రాక

**ఈ నెల 28న బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ**



**తాండూరు ఆక్టోబర్ 26(జనంసాక్షి)**పట్టణంలో ని విలియం మూన్ స్కూల్ లో బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్, ఎస్ఐ, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 28వ తేదీ, బుధవారం మధ్యాహ్నం 03:00 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు ఇతర ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

## గాద్యుయేట్లు ఓటర్ నమోదు చేసుకోవాలి

### రామ్ ప్రదీప్



కాప్రా, అక్టోబర్ 26 ( జనం సాక్షి ) : గ్రాడ్యుయేట్లు ఓటర్ నమోదు చేసుకొని , తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని బిజెపి పార్టీ మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ అధ్యక్షులు రామ్ ప్రదీప్ పేర్కొన్నారు. సోమవారం ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం, హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో బీజేపీ హెచ్‌బీ కాలనీ డివిజన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నూతన ఓటర్ల ఆన్‌లైన్ నమోదు కార్యాలయాన్ని ఎల్‌ఐజీ–75లో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు రామ్ ప్రదీప్ మునుగంటి మాట్లాడుతూ, అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఎమ్మెల్సీ ఓటును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

## ఎక్సైజ్ అధికారులను కలిసిన చర్లపల్లి గౌడ సంఘం నూతన కమిటీ సభ్యులు



కాప్రా, అక్టోబర్ 26 (జనం సాక్షి) : చర్లపల్లి గీత పారిశ్రామిక సహకార సంఘం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సోమవారం కాప్రా ఎక్సైజ్ సిఐ మధుబాబు, ఎస్ఐ రత్నాకలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా గౌడ సంఘం సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రుద్రగోని రాంచందర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి రాగిరి నరసింహ గౌడ్ కోశాధికారి కాసుల శశికాంత్ గౌడ్ సభ్యులు బూడిద శ్రావణ్ కుమార్ గౌడ్ బొడిగె శ్రీరాములు గౌడ్ జీడి శ్రీరాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఆర్‌కే నగర్‌లో రూ.11 కోట్లతో డ్రైనేజీ పనులు ప్రారంభం

### పనులతో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికుల ఆశాభావం



అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 26 (జనం సాక్షి):నాగోల్ సర్కిల్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ ఆర్‌కే నగర్‌లో రూ.11 కోట్ల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పనులను ప్రారంభించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో అధికారుల పర్యవేక్షణలో పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఈ నాగేందర్, డీఈ సుమంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్, పెద్ద అంబర్‌పేట్ మాజీ కౌన్సిలర్ మల్లెపాక మల్లేష్, కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి, చంద్రగోని గోవర్ధన్ గౌడ్, జాలిగామ మోహన్, తాటిపాముల శివ, గడ్డం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న బండి రమేష్



కూకట్‌పల్లి, అక్టోబర్ 26(జనంసాక్షి):మోతీనగర్ డివిజన్ పీఆర్ నగర్‌లోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో గోపిశెట్టి రఘు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్ము కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పాషా నరహరి ఆశయాల సాధనకు పోరాడాలి సీపీఎం నాయకులు

హయత్ నగర్ అక్టోబర్ 26 జనం సాక్షి::సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ మహబూబ్ పాషా నరహరి 37వ వర్ధంతి కార్యక్రమాన్ని సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. చంద్రమోహన్, ఎం. యాదయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలో ఎర్రజెండా నాయకత్వంలో భూమిలేని పేదలకు వేలాది ఎకరాల భూములు పంచేందుకు, వ్యవసాయ కూలీలకు కూలి రేట్లు పెంచేందుకు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా కామ్రేడ్ పాషా నరహరి ప్రజలను చైతన్యపరిచి అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఆయన ప్రజా ఉద్యమాలను అణచివేయాలనే కుట్రలో భాగంగా 1989 అక్టోబర్ 26న హత్యకు గురయ్యారని పేర్కొన్నారు. పేద ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన పాషా నరహరి ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.జాపాల గ్రామంలో 45 అడుగుల ఎత్తైన పాషా నరహరి స్మారక స్థూపాన్నినిర్మిస్తున్నామని, నవంబర్ మొదటి వారంలో సీపీఎం జాతీయ, రాష్ట్ర నాయకుల చేతుల మీదుగా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. స్థూప




ఆవిష్కరణ సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ కమిటీ సభ్యులు మంతాని యాదయ్య, భూషరాజు కాశయ్య, తడబోయిన కృష్ణమూర్తి, మన్యం రాధమ్మ, గ్యార కలమ్మ, సీహెచ్ జంగయ్య, అభిమల్ల గంగమ్మ, దుర్గయ్య, లక్ష్మి, రెడ్డమ్మ, శోభ, మున్ని, యాదమ్మ, కలమ్మ, సఫియా బేగం, సుగుణమ్మ, శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యున్నతికి అబ్బాస్ చేయూత

### కేసారం పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తుల విరాళం

మోమిన్ పేట అక్టోబర్ 26 (జనం సాక్షి)విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ, క్రీడల్లో వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు బీఆర్ఎస్ నాయకుడు అబ్బాస్ ముందడుగు వేశారు. వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మండల పరిధిలోని కేసారం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను విరాళంగా అందజేసి తన ఉదారతను చాటుకున్నారు.విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తే వారు అన్ని రంగాల్లో రాణిస్తారని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు.విద్యార్థులను ప్రోత్సహించే దిశగా అబ్బాస్



క్రీడా దుస్తులు అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల అభివృద్ధికి ఇలాంటి సహకారాలు ఎంతో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య, వార్డు సభ్యులు సాయన్న, ఆగమయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### తొమ్మిది మంది పట్టివేత.. రూ.86,100 నగదు, నాలుగు సెల్ల పేకముక్కలు స్వాధీనం

కూకట్‌పల్లి, అక్టోబర్ 26(జనంసాక్షి):కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) కాలనీలో డబ్బులతో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన అక్టోబర్ 26వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఎంఐజీ––2 కమ్యూనిటీ హాల్ ఎదురుగా ఉన్న భవనంలోని రెండో అంతస్తులో చోటుచేసుకుంది. పోలీసుల ఫిర్యాదు ప్రకారం.. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌కు చెందిన సబ్‌ఇన్‌స్పెక్టర్ శంకర్ గౌడ్ అక్టోబర్ 25వ తేదీ రాత్రి నుంచి నైట్ పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ భవనంలో డబ్బులతో మూడు ముక్కల పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించి, ఇద్దరు పంచ సాక్షులను వెంట తీసుకుని పోలీసు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. భవనం రెండో అంతస్తులోని గదిలోకి వెళ్లి చూడగా, పది మంది పురుషులు వృత్తాకారంలో కూర్చుని డబ్బులతో పేకాట ఆడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులను చూసి ఒక వ్యక్తి పరారవగా, మిగిలిన తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో బి. విద్యా శారధి (54), కె. రామచందర్ (66), ప్రవీణ్ గౌడ్ (52), బి.వి.కె. స్వామి (43), విమల్ కిషోర్ జైన్ (58), డి. జయంత్ (72), ఎం. శ్రీనివాస్ (86), సందకేశ్వర్ (71), షేక్ రాజ్ మహమ్మద్ (58) ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన వారిగా వివరించారు. మరో వ్యక్తి మధు పోలీసులను చూసి పారిపోయినట్లు పేర్కొన్నారు. విచారణలో భాగంగా వారు గత రాత్రి ఓ కార్యక్రమానికి హాజరైన అనంతరం సుమారు 11 గంటల సమయంలో అక్కడికి వచ్చి డబ్బులతో పేకాట ఆడుతున్నట్లు తెలిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని పంచ సాక్షుల సమక్షంలో పరిశీలించిన పోలీసులు నాలుగు సెట్ల పేకముక్కలు, రూ.86,100 నగదును స్వాధీనం చేసుకున్నారు.అనంతరం అదుపులోకి తీసుకున్న వ్యక్తులను, స్వాధీనం చేసుకున్న నగదు మరియు పేకముక్కలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్ఐ శంకర్ గౌడ్ ఫిర్యాదు సమర్పించారు. ఈ ఘటనపై తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టాల్సి ఉంది.

## రబీలో వరి సాగును తగ్గించాలి

### వ్యవసాయ శాఖ డైరక్టర్ గోపి

మహేశ్వరం,అక్టోబర్26(జనంసాక్షి): ఎల్ నినో ప్రభావం వల్ల రబీలో వరి సాగును తగ్గించాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని వ్యవసాయ శాఖ డైరక్టర్ గోపి అన్నారు.సోమవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం దుద్యచర్ల క్లస్టర్ లో రైతులు కేటీ



బచావో అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరక్టర్ గోపి మాట్లాడుతూ ...రైతులు రసాయనిక ఎరువులను,పురుగు మందులను వాడకం తగ్గించాలని రైతులకు సూచించారు.ఎల్ నినో ప్రభావం వల్ల పంట మార్పిడి,ఆరుతడి పంటలు వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిని సుజాత,మహే శ్వరం ఏడీఏ సుధారాణి, దుబ్బచర్ల గ్రామ సర్పంచ్ శ్రీవారెడ్డి,ఉప సర్పంచ్ సురేష్,వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు చంద్రకాంత్,శ్రీకృష్ణ, సుధీర్,దిలీప్,పలువురు వ్యవసాయ శాఖ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సభ్యుల కుటుంబాలకు సంఘం భరోసా

షాబాద్, అక్టోబర్ 26 (జనం సాక్షి): అనుకోని సంఘటనలు ఏర్పడినప్పుడు చేయూత అందించడమే వివేకానంద పొదుపు సంఘం యొక్క ముఖ్య లక్ష్యం అని సంఘం అధ్యక్షులు ధర్పల్లి రవీందర్ గౌడ్ పేర్కొన్నారు



.ఇటీవల అనారోగ్యంతో సంఘం సభ్యుడు లంబాడి శ్రీనివాస్ మృతి చెందగా, సోమవారం వారి కుటుంబ సభ్యులకు సంఘం తరపున లక్ష రెండు వేల ఇన్సూరెన్స్ మొత్తాన్ని సంఘం ప్రతినిధులతో కలిసి అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అతిపిన్న వయసులోనే శ్రీనివాస్ మృతి చెందడం ఎంతో బాధాకరమని తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని అందిస్తూ, ఆపదలో ఉన్న సభ్యుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే సంఘం యొక్క ముఖ్య లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎర్రోళ్ల రవి, గంధం గౌరీశ్వర్, లంబాడి రాము, కమ్మరి రజినీకాంత్, తంబలి గౌతమ్, లంబాడి నర్సింలు పాల్గొన్నారు.

## ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడిగా కిషన్ సింగ్



**హైదరాబాద్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా 64వ జాతీయ అధ్యక్షుడిగా 2026--27 కాలానికి ప్రముఖ వ్యాపారవేత్త, తిరుమల బాలాజీ పేపర్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ టీ కిషన్ సింగ్ ఎన్నికయ్యారు. ఈ పదవిని అధిరోహించిన హైదరాబాద్‌కు చెందిన నాలుగో వ్యక్తిగా నిలిచారు. దేశవ్యాప్తంగా పది వేల మందికి పైగా కాగితపు వ్యాపారులకు ప్రాతినిధ్యం వహించే అత్యున్నత సంస్థ ఇది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా జాతీయ పరిధిని విస్తరించడం, అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, జాతీయ కాగిత దినోత్సవానికి అధికారిక గుర్తింపు సాధించే దిశగా కృషి చేస్తామన్నారు. మరింత పటిష్టంగా అందరినీ కలుపుకొనిపోతూ వ్యాపారుల సంక్షేమమే కేంద్రంగా పని చేయనున్నామన్నారు. కాగిత వ్యాపారులకు విస్తృత అవకాశాలు సృష్టిస్తూ, నిరంతర వృద్ధికి దోహదపడగలమని తెలిపారు.

## ప్రశాంత్ నగర్‌లో బీజేపీలోకి యువత చేరికలు

### మోదీ నాయకత్వానికి ఆకర్షితులై పార్టీలో చేరిన యువకులు



**కూకట్ పల్లి, అక్టోబర్ 26(జనంసాక్షి):**కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్ డివిజన్ పరిధిలోని ఏవీబీపురానికి చెందిన పలువురు యువకులు కార్తీక్, లక్ష్మణరావు నాయకత్వంలో, జిల్లా ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై యువకులు బీజేపీలో చేరినట్లు నాయకులు తెలిపారు. దేశాభివృద్ధి, ప్రజాసేవలో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నూతన సభ్యులకు పార్టీ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వీరన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఐహెచ్‌ఎంలో ముగిసిన నేషనల్ బడ్డింగ్ ఈవెంట్స్

### రీజెన్సీ, ఐహెచ్‌ఎం గోవా విద్యార్థుల హవా



**హైదరాబాద్ (జనంసాక్షి)**ఆతిథ్య రంగంలో ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం హైదరాబాద్) నిర్వహించిన ఐదో సీజన్ 'నేషనల్ బడ్డింగ్ ఈవెంట్స్' విద్యానగర్‌లోని డీడీ కాలనీ క్యాంపస్‌లో ఘనంగా ముగిశాయి. నాలుగు రోజుల పాటు హోరాహోరీగా సాగిన ఈ మెగా పోటీల్లో గౌతమ్ ఆనంద్ (రీజెన్సీ కాలేజ్, హైదరాబాద్), కుమారి ప్రతిష్ఠా సింగ్ (ఐహెచ్‌ఎం గోవా) 'నేషనల్ బడ్డింగ్ ప్రొఫెషనల్స్-2026' విజేతలుగా నిలిచారు. ఐహెచ్‌ఎం గోవాకు చెందిన క్రిస్లిన్ రోజ్, కట్టా నితిన్ శ్రీనివాసరావుల ద్వయం 'నేషనల్ బడ్డింగ్ చెఫ్ 2026' ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఇందులో నేషనల్ బడ్డింగ్ ప్రొఫెషనల్ కాంపిటీషన్ (మేనేజర్), నేషనల్ బడ్డింగ్ చెఫ్ కాంపిటీషన్లు జరిగాయి. ఈ మెగా ఈవెంట్‌లో దేశవ్యాప్తంగా, హైదరాబాద్‌లోని ప్రముఖ ఐహెచ్‌ఎంలు, ఎస్ఐహెచ్‌ఎంలు, ప్రైవేట్ హాస్పిటాలిటీ సంస్థల నుంచి బడ్డింగ్ ప్రొఫెషనల్, బడ్డింగ్ చెఫ్ విభాగాల్లో ఒక్కో విభాగం నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. ఈ వేడుకకు ఐహెచ్‌ఎం-హైదరాబాద్ ప్రిన్సిపాల్, మెంబర్ సెక్రటరీ సంజయ్ ఠాకూర్, హెచ్‌ఓడీ కుమారి రచన అగాషే, ఎఫ్‌డబి సర్వీస్ హెచ్‌ఓడీ పునీత్ రజ్దాన్ హాజరయ్యారు.

## పట్టభద్రుల ఓటరు నమోదుకు సహాయ కేంద్రం



**అల్వాల్, అక్టోబరు 26(జనంసాక్షి):**రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు మచ్చ బొల్లారం డివిజన్‌లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్సీ ఇన్‌ఛార్జి నందికంటి శ్రీధర్ సోమవారం ప్రారంభించారు. సురేష్ సేవాసమితి కార్యాలయం సమీపంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ నర్ల సురేష్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నర్ల సురేష్ మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించడంతోపాటు, నమోదు ప్రక్రియలో అవసరమైన సహాయం అందించడమే కేంద్రం లక్ష్యమన్నారు. విద్యావంతులు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొబ్బిలి మధుసూదన్‌రెడ్డి, డోలి రమేష్, బసిరుద్దీన్, సత్తన్న, వంశీ, శంకర్‌రెడ్డి, సులోచన, పవన్, సతీష్, రేవంత్, నర్సింగ్, ధనరాజ్, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యావేత్త నుండి వికారాబాద్ జిల్లా సారథిగా

### చిరునవ్వుతో అందరినీ కలుపుకునే నాయకుడు యు. రమేష్ కుమార్



**తాండూరు అక్టోబర్ 26(జనంసాక్షి)**ఒక ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన వ్యక్తి, నేడు ఒక జిల్లాకు నాయకత్వం వహించే స్థాయికి ఎదగడం వెనుక ఎంతో కృషి, నిబద్ధత ఉంటుంది. అందుకు నిదర్శనమే భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు యు. రమేష్ కుమార్ ప్రస్థానం. విద్యావేత్తగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన రమేష్, తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ప్రతి పోరాటంలో ముందుండి, విద్యార్థులను, యువతను చైతన్యపరిచారు. ఉద్యమ స్ఫూర్తిని తన మాటల్లో, చేతల్లో చూపించారు.తెలంగాణ ఆవిర్భావం తర్వాత భారతీయ జనతా పార్టీలో చేరి క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారు. అందుకే పార్టీ అధిష్టానం ఆయనకు వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు అప్పగించింది.రమేష్ గొప్పతనం ఆయన వ్యక్తిత్వంలో ఉంది. ఎవరిని కలిసినా చిరునవ్వుతో పలకరించడం, చిన్నా పెద్దా తేడా లేకుండా అందరినీ కలుపుకుని పోవడం ఆయన ప్రత్యేకత. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరితో సత్సంబంధాలు కొనసాగించే మనస్తత్వం కలిగిన అరుదైన నాయకుడిగా ఆయనకు ప్రజల్లో మంచి పేరు ఉంది.విద్య, ఉద్యమం, రాజకీయం.. ఏ రంగంలో ఉన్నా ప్రజా సేవే పరమావధిగా భావించే రమేష్, భవిష్యత్తులో వికారాబాద్ జిల్లా బీజేపీని మరింత బలోపేతం చేస్తారని కార్యకర్తలు, అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పేదల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి అందేలా చర్యలు తీసుకోవాలి

### ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేకాధికారి వేముల శ్రీనివాస్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, అక్టోబర్ 26 (జనం సాక్షి):**ఉప్పల్ నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే ఆర్థిక సహాయాన్ని సకాలంలో మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేకాధికారి వేముల శ్రీనివాస్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పేద, మధ్యతరగతి కుటుంబాలు వైద్య చికిత్సల కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు అవసరమైన అనుమతి పత్రాల మంజూరు, దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలను ఆయన ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్లారు.అర్హులైన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సకాలంలో ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సహాయం అందించడంలో జాప్యం జరగకుండా, అనుమతి పత్రాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా సంబంధిత అంశాలపై సానుకూలంగా స్పందించి, అర్హులకు తగిన సహాయం అందేలా చూడాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు.

## మహర్షి వాల్మీకి బోధనలు మార్గదర్శకం

### అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి



**రంగారెడ్డి , అక్టోబర్ 26 (జనంసాక్షి):**ఆదికవి మహర్షి వాల్మీకి అందించిన బోధనలు, ఆదర్శాలు నేటి సమాజానికి ఎంతో మార్గదర్శకమని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి పేర్కొన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి రచించిన శ్రీమద్భాగవత రామాయణ మహాకావ్యం ధర్మం, నీతి, సత్యం మరియు మానవీయ విలువలకు అద్దం పడుతుందని కొనియాడారు. యువతకు స్ఫూర్తి: వాల్మీకి మహర్షి జీవిత ప్రస్థానం, ఆయన రచనలు నేటి యువతరానికి, రాబోయే తరాలకు నిరంతరం స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి కేశురామ్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మరియు వాల్మీకి సంఘం ప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

## గ్రామాల్లో భూ సర్వేలకు రైతులు సహకరించాలి

### డిప్యూటీ తహసిల్దార్ సురేష్



**మోమిన్ పేట అక్టోబర్ 26 ( జనం సాక్షి)** గ్రామాల్లో భూ సర్వేలకు రైతులందరూ సహకరించి భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించుకోవాలని మండల డిప్యూటీ తహసిల్దార్ సురేష్ పేర్కొన్నారు సోమవారం మోమిన్ పేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూ సర్వే అవగాహన సదస్సు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు తమ భూముల సర్వేలు చేయించుకొని రికార్డు హద్దులు సరిచూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు, భూ సర్వే తో తమ భూములను రైతులు సంరక్షించుకునే బాధ్యత వారిపై ఉందన్నారు అందుకు రైతులకు అధికారులు ఎప్పటికప్పుడు సహకారం అందిస్తుంటారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంధ్యా సుభాష్ గౌడ్, ఆర్ ఐ సరిత, జిపిఏలు శ్రీనివాస్ రెడ్డి వెంకట్ రెడ్డి సర్వేయర్ రాందాస్, వార్డు సభ్యులు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు

## తుల్జా భవానీ అమ్మవారిని దర్శించుకున్న పైలెట్ రోహిత్ రెడ్డి



**తాండూరు అక్టోబర్ 26(జనంసాక్షి)** మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి సోమవారం మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లా తుల్జాపూర్‌లో కొలువైన శ్రీ తుల్జా భవానీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయనకు స్థానిక మేయర్, ఆలయ అధికారులు స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అంతకుముందు ఆదివారం సాయంత్రం తుల్జాపూర్‌లో పాదయాత్రగా వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన (మహాప్రసాదం) కార్యక్రమంలోనూ పైలెట్ రోహిత్ రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానికి వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.పైలెట్ రోహిత్ రెడ్డితో పాటు తాండూరు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, బీఆర్ఎస్వీ నాయకులు, ఆయన అభిమానులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## కబ్రస్తాన్ వద్ద కమ్యూనిటీ మూత్రశాలల నిర్మాణం నిలిపివేయాలి

### ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ముజఫర్ హుస్సేన్



**ధారూర్,అక్టోబర్ 26(జనంసాక్షి)**ధారూర్ మండల కేంద్రంలోని కబ్రస్తాన్ వద్ద చేపడుతున్న కమ్యూనిటీ మూత్రశాలల నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని మండల కేంద్రానికి చెందిన ముజఫర్ హుస్సేన్ అధికారులను కోరారు.ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు సమర్పించారు.కబ్రస్తాన్ వద్ద కమ్యూనిటీ మూత్రశాలల నిర్మాణం చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ,నిర్మాణ పనులను వెంటనే ఆపి తగిన చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజావాణిలో సమర్పించిన ఫిర్యాదుపై అధికారులు స్పందించి, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ముజఫర్ హుస్సేన్ కోరారు.

## సీఎం ఇంటి ముట్టడికి పిలుపు

### అల్వాల్‌లో ఉద్యమకారుల అరెస్టు



**అల్వాల్, అక్టోబరు 26 (జనంసాక్షి):** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్వాల్‌లో 40 రోజులుగా దీక్ష చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం అల్వాల్ పోలీసులు పలువురిని ముందస్తుగా అరెస్టు చేశారు. పాటోళ్ల సురేందర్‌రెడ్డి, దోలి సుధీర్, రామయ్య, సంగమేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఈ సందర్భంగా ఉద్యమకారులు ఆందోళన వ్యక్తం చేశారు.

## ఘనంగా తుంగతుర్తి రవి జన్మదిన వేడుకలు



**బోడుప్పల్-జనంసాక్షి:**మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆర్ వి ఫౌండేషన్ తుంగతుర్తి రవి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్,రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్,జిల్లా ఉపాధ్యక్షులు మహేష్ గౌడ్,జిల్లా కమిటీ సభ్యులు,పలు డివిజన్ ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యాపార ప్రముఖులు, డివిజన్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని తుంగతుర్తి రవిని ఘనంగా సన్మానించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మాధవరం కాంతారావును పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**కూకట్ పల్లి, అక్టోబర్ 26(జనంసాక్షి):**కూకట్పల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంచార్జ్ మాధవరం కాంతా రావును వారి నివాసంలో సోమవారం కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ స్వయంగా కలిసి పరామర్శించారు, కాంతారావు తండ్రి ఐనా మాధవరం లక్ష్మణ్ రావు ఇటీవల పరమపదించిన సంగతి తెలిసిందే, ఈ సందర్భంగా లక్ష్మణ్ రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు, ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు, యంజాల పద్మయ్య, పులువురు పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ లను అమలు చేసే వరకు ఉద్యమం ఆగదు : సీఐటీయూ



**శామీర్ పేట అక్టోబర్ 26(జనం సాక్షి )**తెలంగాణ రాష్ట్రంలోని కార్మికుల సమస్య పరిష్కరించాలని డిమాండ్‌తో ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నాకు మున్సిపల్ కార్మికులతో సీఐటీయూ నాయకులు బయలు దేరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, రెండవ పీఆర్సీని ప్రకటించాలని, కనీస వేతనాన్ని నెలకు రూ.30,000గా నిర్ణయించాలని, డీఏ అమలు చేయాలని యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా మున్సి పాలిటీలు, కార్పొరేషన్లలో వేలాది మంది కార్మికులు పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, రవాణా తదితర కీలక విధులు నిర్వహిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ పట్టణాల పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులకు సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం అన్యాయమని యూనియన్ పేర్కొంది. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేక కుటుంబ పోషణ భారంగా మారింది. ఉద్యోగ భద్రత, పెన్షన్, ఈ ఎస్ ఐ, పీఎఫ్, ఆరోగ్య సదుపాయాలు వంటి హక్కు లను సమర్థవంతంగా అమలు చేయ్యాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఐక్యతతోనే న్యాయమైన హక్కులను సాధించగలమని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమం లో సిఐటియు నాయకులు కిష్టప్ప మున్సిపల్ జిల్లా నాయకులు ప్రశాంత్, శ్రీను, రమేష్, బాలేష్, బిక్షపతి,మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## ఎస్సీ, బీసీ-సీ నిరుద్యోగ యువతకు ఎనిమిది రోజుల వ్యవస్థాపకత శిక్షణ

### స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన.. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 26 (జనం సాక్షి) : హైదరాబాద్ జిల్లాలోని నిరుద్యోగ షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ), బీసీ-సీ వర్గాలకు చెందిన యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో ఎనిమిది రోజుల వ్యవస్థాపకత అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ చైర్మన్ తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఏఎఫ్‌సి ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణలో వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు, హెర్బల్ కాస్మెటిక్స్, ఫ్యాషన్ గార్మెంట్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) తదితర రంగాల్లో వ్యాపార అవకాశాలు, వ్యవస్థాపకతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించనున్నారు. యువతలో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడం, స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించడం, వివిధ ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్ధి పొందేలా చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.అర్హతలు ఇవే..దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎస్సీ లేదా బీసీ-సీ వర్గాలకు చెందిన వారై ఉండాలి. వేతన ఉపాధి శిక్షణలకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు, స్వయం ఉపాధి శిక్షణలకు 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉండాలి. ఎంపిక చేసుకున్న కోర్సుకు తగిన విద్యార్హతలు కలిగి ఉండటంతో పాటు, పట్టణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించకూడదు. ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలి.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. అభ్యర్థుల ఎంపికను వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఏర్పాటు చేసిన కమిటీ, జిల్లా సంఘాలు, శిక్షణ సంస్థల సమన్వయంతో నిర్వహించే ఇంటర్వ్యూ లేదా పరీక్ష ఆధారంగా చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ చైర్మన్ కోరారు.

## పేదల భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### కిసాన్ మిత్ర హెల్ప్ లైన్ ప్రజావాణిలో ఫిర్యాదు



**మోమిన్‌పేట, అక్టోబర్ 26:( జనం సాక్షి)**మోమిన్‌పేట మండలంలోని సైదాలిపూర్,చక్రంపల్లి, టేకులపల్లి, కస్గాబాద్ గ్రామాలకు చెందిన పలువురు పేద రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం కిసాన్ మిత్ర హెల్ప్ లైన్‌ను సంప్రదించారు. ఈ నేపథ్యంలో, బాధితుల భూ సమస్యలపై ఈ రోజు మోమిన్‌పేట మండల ప్రజావాణిలో సంబంధిత దరఖాస్తులను సమర్పించడం జరిగింది.అనేక సంవత్సరాలుగా భూ సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయాలు, ఇతర రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన వర్గాలకు చెందిన రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాల నమోదు, భూ రికార్డుల సవరణ, ఆన్‌లైన్‌లో భూముల వివరాల నమోదు, విస్తీర్ణంలో తేడాలు, వారసత్వ మార్పులు తదితర సమస్యలతో సతమతమవుతున్నారు.భూమిపై ఆధారపడి జీవించే పేద రైతులకు భూమి కేవలం ఆస్తి మాత్రమే కాదు, వారి కుటుంబాల జీవనాధారం కూడా. భూ సమస్యలు సంవత్సరాల తరబడి పరిష్కారం కాకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు పొందడంలో, వ్యవసాయ పెట్టుబడులు సమకూర్చుకోవడంలో, తమ హక్కులను నిరూపించుకోవడంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కార్యాలయాల చుట్టూ తిరగడానికి సమయం, డబ్బు ఖర్చు చేయలేని పేద కుటుంబాలు మరింత ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నాయి.ఈ నేపథ్యంలో, మోమిన్‌పేట మండల ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, భూ రికార్డులను క్షేత్రస్థాయిలో ధృవీకరించి, అర్హులైన బాధితుల సమస్యలను చట్ట నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని కిసాన్ మిత్ర హెల్ప్ లైన్ ప్రభుత్వాన్ని కోరుతోంది. ప్రతి దరఖాస్తుకు సంబంధించిన ప్రస్తుత స్థితిని బాధితులకు తెలియజేస్తూ, అవసరమైన చర్యలు పారదర్శకంగా చేపట్టాలని విజ్ఞప్తి చేస్తోంది.పేద ప్రజలు సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితికి ముగింపు పలికి, వారి భూ హక్కులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం, జిల్లా రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కిసాన్ మిత్ర హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు

## కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వార్థ రాజకీయాలు చేస్తున్నారు

### బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజు



**మహేశ్వరం,అక్టోబర్26(జనం సాక్షి):**కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజు సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.మహేశ్వరం గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1,2 లలో ఉన్న పెరటి భూములు పట్టా భూములు అన్నారు.రెవిన్యూ రికార్డుల ప్రకారం కూడా పట్టా భూమిగానే ఉందన్నారు.1991 సంవత్సరంలో లే అవుట్ చేశారన్నారు.తాము పట్టా భూమినే కొనుగోలు చేశామన్నారు.అప్పటి మార్కెట్ ధరకంటే అధికంగానే ప్లాట్లను కొనుగోలు చేశామన్నారు.తాము ఒక అంగుళం భూమిని కూడా కబ్జా చేయలేదు అన్నారు. కాంగ్రెస్ నేతలు తమపై వ్యక్తిగత రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు.పేద ప్రజలు కష్టం చేసి ప్లాట్లను కొనుగోలు చేశారన్నారు.కాంగ్రెస్ నాయకులు బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారన్నారు.తాము కొనుగోలు చేసిన ప్లాట్లలో గ్రామ కంఠం భూమి ఉంటే ప్రభుత్వం తీసుకోవాలన్నారు.రెవిన్యూ అధికారులు గ్రామ కంఠం భూమిని తేల్చాలన్నారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్,కటికల శ్రీహరి,దుద్దు కృష్ణ,మహేష్ ముదిరాజ్,ప్లాట్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# యాలాల జడ్పీటీసీ బరిలో బిఆర్ఎస్ యువనేత కోట్ల మహేశ్వర్ రెడ్డి

**పార్టీకి కష్టకాలంలోను వెన్నంటి నిలిచిన యువ విధేయత.. టికెట్‌పై ధీమా !**

**సీనియర్ నేతల అండదండలు.. యువతలో పెరుగుతున్న గుర్తింపు.**



**యాలాల అక్టోబర్ 26 ( జనంసాక్షి ) :** అధికారం ఉన్నా.. లేకున్నా పార్టీనే నమ్ముకుని ముందుకు సాగుతున్న యువ నాయకుడు అగ్గనూర్ కోట్ల మహేశ్వర్ రెడ్డి ఇప్పుడు యాలాల మండల బీఆర్ఎస్ రాజకీయాల్లో జడ్పీటీసీ అభ్యర్థిత్వంపై చర్చకు కేంద్రబిందువుగా మారుతున్నారు. రాజకీయ పరిణామాలు మారినా, పార్టీ నాయకుడు మరియు పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా విధేయతను వీడకుండా కొనసాగిన ఆయనకు రాబోయే జడ్పీటీసీ ఎన్నికల్లో అవకాశం దక్కుతుందా అన్న ఆసక్తి పార్టీ వర్గాల్లో నెలకొంది. అగ్గనూరు గ్రామానికి చెందిన మహేశ్వర్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని అడుగులు వేస్తున్నారు.కష్టకాలంలోనూ పార్టీని వీడని నేతగా గుర్తింపు !రాజకీయాల్లో అధికారమే కొందరికి ప్రాధాన్యంగా మారుతున్న తరుణంలో, అధికార మార్పిడి జరిగినా పార్టీకి కట్టుబడి ఉండటం తన ప్రత్యేకతగా కోట్ల మహేశ్వర్ రెడ్డి గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. రాజకీయ సమీకరణాలు మారి పలువురు నేతలు ఇతర పార్టీల వైపు అడుగులు వేసిన సమయంలోను ఆయన బి ఆర్ ఎస్ పార్టీని నమ్ముకుని పార్టీ పట్ల తనకున్న నిబద్ధతకు నిదర్శనంగా వారు పేర్కొంటున్నారు. ఈ విధేయతే భవిష్యత్తులో తనకు రాజకీయ అవకాశాలను తెచ్చిపెడుతుందన్న ఆశాభావంతో ఆయన ముందుకు సాగుతున్నారు .సీనియర్ నాయకులతో సత్సంబంధాలు.. టికెట్‌పై ఆశలు !బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పి. విట్టల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, తాండూరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి పి. శ్రీశైల్ రెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి తో పాటు ఇతర ముఖ్య నాయకులతో మహేశ్వర్ రెడ్డి సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. సీనియర్ నాయకుల మద్దతు, పార్టీ పట్ల తన విధేయత, యువతలో ఉన్న గుర్తింపు తన అభ్యర్థిత్వానికి బలంగా మారుతాయని ఆయన ఆశిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.యువతలో గుర్తింపు.. రాజకీయ భవిష్యత్తుపై ధీమా!యాలాల మండలంలోని యువతతో సత్సంబంధాలు కలిగి ఉండటం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం మహేశ్వర్ రెడ్డికి కలిసొచ్చే అంశాలుగా భావిస్తున్నారు. యువతను కలుపుకుని ముందుకు సాగుతూ, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్న ఆయనకు జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం లభిస్తే రాజకీయంగా మరింత ఎదిగేందుకు మార్గం సుగమమవుతుందని అనుచరులు ఆశిస్తున్నారు.విధేయతకు గుర్తింపు దక్కుతుందా?జడ్పీటీసీ టికెట్ కేటాయింపు విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే కీలకం కానుంది. సీనియర్ల అనుభవం, యువత ఆకాంక్షలు, క్షేత్రస్థాయిలో నాయకుల బలాబలాలు అభ్యర్థి ఎంపికలో ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కోట్ల మహేశ్వర్ రెడ్డికి పార్టీ నాయకత్వం అవకాశం కల్పిస్తుందా? కష్టకాలంలోనూ పార్టీని నమ్ముకుని సాగిన ఆయన విధేయతకు గుర్తింపు లభిస్తుందా? అన్నది రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం అభ్యర్థిత్వంపై ఆశలు పెట్టుకున్న మహేశ్వర్ రెడ్డి, పార్టీ పెద్దల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న యువ నాయకుడిగా చర్చలో నిలుస్తున్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వృథాను అరికట్టాలి

**అధికారులు, సిబ్బంది పొదుపు చర్యలను ఆచరణలో చూపాలి**

**కలెక్టర్ ప్రియాంక అలా**




**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించి, పొదుపుగా ఉపయోగించుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా జిల్లా అధికారులకు, ఉద్యోగులకు సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ పొదుపు చర్యలను పకడ్బందీగా అమలు చేస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఆదేశించారు.విద్యుత్ వృథాను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయి కార్యాలయాల్లో పగటిపూట తగినంత సహజ వెలుతురు ఉన్నప్పటికీ లైట్లు వినియోగించడం, గదుల్లో ఎవరూ లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు ఆన్‌లో ఉంచడం వంటి అలవాట్లను తక్షణమే మార్చుకోవాలని సూచించారు.అవసరం లేని పరికరాలను ఆఫ్ చేయాలి..కార్యాలయ గదులు, కారిడార్లు, హాళ్లు, క్యాబిన్లలో పగటిపూట సహజ వెలుతురు అందుబాటులో ఉన్నప్పుడు విద్యుత్ లైట్లను వినియోగించవద్దని కలెక్టర్ సూచించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో, సమావేశాలకు వెళ్లినప్పుడు, క్షేత్రస్థాయి పర్యటనల సందర్భంగా గదుల్లో ఎవరూ లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు, కంప్యూటర్లు, ప్రింటర్లు తదితర విద్యుత్ పరికరాలను తప్పనిసరిగా నిలిపివేయాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖ అధికారి తమ కార్యాలయంలో విద్యుత్ పొదుపు నిబంధనలు అమలయ్యేలా సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని తెలిపారు. విద్యుత్ పరికరాల వినియోగాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరం లేని సమయంలో వాటిని ఆఫ్ చేసే బాధ్యతను సిబ్బందికి అప్పగించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీరు, విద్యుత్ వంటి సహజ వనరులను పొదుపుగా వినియోగించడం అత్యంత అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా అధికారులు, ఉద్యోగులందరూ ఈ ఆదేశాలను తక్షణమే అమలు చేస్తూ విద్యుత్, నీటి పొదుపులో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

# కోట్ పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

**పోలీసుల విధులు, చట్టాల అమలుపై అవగాహన**



**కోట్‌పల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి):** విద్యార్థుల్లో పోలీసు వ్యవస్థపై అవగాహన పెంపొందించడంతో పాటు, చట్టాల పట్ల గౌరవం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అలవర్చే లక్ష్యంతో కోట్‌పల్లి మండలానికి చెందిన విద్యార్థులు సోమవారం కోట్ పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఎస్ఐ మీనాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీసుల విధులు, శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాల అమలు, ప్రజల భద్రతకు పోలీసులు చేపట్టే చర్యల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మీనాక్షి విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే రోజువారీ విధులు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కారానికి తీసుకునే చర్యలు, నేరాల నియంత్రణలో పోలీసుల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడటం, ప్రజలకు రక్షణ కల్పించడం, చట్టాలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం వంటి బాధ్యతలను పోలీసులు నిర్వర్తిస్తారని వివరించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసులను సంప్రదించి తగిన సహాయం పొందవచ్చని తెలియజేశారు.పోలీస్ స్టేషన్ అనేది కేవలం నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించే ప్రదేశం మాత్రమే కాదని, ప్రజలకు భద్రత కల్పిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే ముఖ్యమైన వ్యవస్థ అని విద్యార్థులకు వివరించారు. పోలీసుల విధులు, బాధ్యతలు, ప్రజలతో వారు వ్యవహరించే విధానం గురించి తెలియజేస్తూ, చట్టాలను అమలు చేయడంలో పోలీసు శాఖ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పోలీసు వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభించింది.అలాగే విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించే పనులకు పాల్పడకూడదని, సమాజానికి ఉపయోగపడే మంచి పనుల్లో భాగస్వాములు కావాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే సామాజిక బాధ్యతను పెంపొందించుకుంటే భవిష్యత్తులో సమాజాభివృద్ధికి దోహదపడే పౌరులుగా ఎదగవచ్చని వివరించారు. ఏదైనా అన్యాయం, నేరం లేదా అనుమానాస్పద సంఘటన తమ దృష్టికి వచ్చినప్పుడు భయపడకుండా బాధ్యతాయుతంగా పెద్దలకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# కొమురం భీం గొప్ప పోరాట యోధుడు అఫ్జల్ ఖాన్



**శామీర్ పేట్, అక్టోబర్ 26(జనం సాక్షి )**కొమురంభీం గొప్ప పోరాట యోధుడని అఫ్జల్ ఖాన్ అన్నారు. సోమవారం కొమురం భీం 86 వ వర్ధంతి సందర్భంగా శామీర్ పేట్ లో సీనియర్ ఉద్యమ, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ కొమురం భీం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు.. జల్ జంగల్ జమీన్ నినాదంతో జోడేఘాట్ కేంద్రంగా గెరిల్లా తరహా పోరాటం చేసి నైజాం సర్కారు కు ముచ్చెమటలు పట్టించిన యోధుడు కొమురం భీం అని అన్నారు. భూ పోరాటం చేసి పేదలను ఆదుకున్న కొమురం భీం ఆశయాలను కొనసాగించాలని యువతకు అఫ్జల్ ఖాన్ పిలుపునిచ్చారు.ఆయన చేసిన పోరాట ఎన్నో పోరాటాలకు నాంది పలికాయని అఫ్జల్ ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్ ఖాన్ తో పాటు ఉపాధ్యాయులు, నాయకులు పి నర్సింహా రెడ్డి, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, గౌరయ్య ,నితిన్,షాఘంటి మహేష్ ముదిరాజ్,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సృష్టి ఐ కేర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, అక్టోబర్ 26 (జనం సాక్షి)** హయత్‌నగర్ బొమ్మలగుడి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సృష్టి ఐ కేర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాజరై, ఐ కేర్ కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన శ్రీ సృష్టి ఐ కేర్ మరింత అభివృద్ధి సాధించి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, కంటి సమస్యలు ఎదురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ ఐ కేర్ కేంద్రం ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ మరింత పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీవన్ అన్న మిత్రబృందం సభ్యుడు పాండల శ్రీధర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# అర్హులైన పట్టభద్రులంతా నవంబరు 6లోగా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

**: బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్ గౌడ్**



**యాచారం, అక్టోబర్ 26(జనం సాక్షి )** అర్హత కలిగిన పట్టభద్రులంతా ఈ నెల నవంబరు 6వ తేదీలోగా తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఓటర్లుగా పేరు నమోదు చేసుకోవాలని బి ఆర్ ఎస్ పార్టీ యాచారం మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు.మండల కేంద్రంలోని 'సాయి శరణం గార్డెన్'లో ఆయన ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం రకరకాల మాయమాటలు చెప్పి తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. యువత మరియు పట్టభద్రులు తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా నమోదు చేసుకుని, వినియోగించుకోవడం ద్వారానే ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కాగలరని ఆయన సూచించారు.అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించేందుకు పార్టీ శ్రేణులు, నాయకులు క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంజాయితో ఇద్దరి అరెస్ట్

### 168 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 26 (జనం సాక్షి):** ఫిల్మ్‌సిటీ ఎదురుగా బాలాజీ దాబా సమీపంలోని ఎన్‌హెచ్-65పై గంజాయితో సంచరిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 25న రాత్రి మణికంఠ, ప్రతాప్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 168 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన రిపోర్టర్ కే.సీ. మోహన్‌కు పరామర్శించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**కాప్రా, అక్టోబర్ 26 ( జనం సాక్షి ) :** రోడ్డు ప్రమాదంలో గాయపడి సూర్య హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కాప్రా సీనియర్ రిపోర్టర్ కే.సీ. మోహన్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మోహన్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లో చేరాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు బి ఆర్ ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాసం మైపాల్ రెడ్డి, పెద్దాపురం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గంలోని తాగునీటి సమస్యల పరిష్కారానికి

### జలమండలి అధికారులతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమీక్ష



**కాప్రా అక్టోబర్ 26 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలు, పైప్‌లైన్ లీకేజీలు, కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు, పెండింగ్ పనుల పురోగతి తదితర అంశాలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్న ప్రాంతాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్ణీత సమయాల్లో తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

## వాల్మీకి మహర్షి రచించిన రామాయణం యావత్ మానవాళికి ఆదర్శం

### కంజర్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు విజయలక్ష్మి



**తాండూరు అక్టోబర్ 26(జనంసాక్షి)**వాల్మీకి మహర్షి రచించిన రామాయణం యావత్ మానవాళికి ఆదర్శమని కంజర్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు విజయలక్ష్మి పేర్కొన్నారు.సోమవారం తాండూరు నియోజకవర్గంలో ని బషీరాబాద్ మండలం పర్వత్ పల్లి గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా కంజర్ల విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన రామాయణం యావత్ మానవాళికి ఆదర్శమని, ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.అనంతరం వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, వాల్మీకి సంఘం నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోతుల బెడద నుంచి రైతులను కాపాడాలి

### ప్రజావాణిలో రైతుల ఫిర్యాదు




**ధారూర్,అక్టోబర్ 26(జనంసాక్షి)**ఒకవైపు ఎల్‌నినో ప్రభావంపై ఆందోళన. మరోవైపు పంట పొలాలపై కోతుల దండయాత్ర.! ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు కోతుల బెడద తీవ్ర సమస్యగా మారింది.ఇప్పటికే ప్రకృతి ప్రతికూల పరిస్థితులతో సతమతమవుతున్న రైతులకు కోతుల దాడులు మరింత భారంగా మారాయి.అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలను కోతులు నాశనం చేస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పంటలు పండించడమే కష్టంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో, చేతికొచ్చే పంటలను కోతుల నుంచి కాపాడుకోవడానికి నిత్యం పోరాడాల్సి వస్తోందని వాపోతున్నారు.ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను కోతుల బెడద నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.కోతుల గుంపులు పంట పొలాల్లోకి చొరబడి పంటలను ధ్వంసం చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.పంటల సాగు కోసం చేసిన పెట్టుబడులు తిరిగి వస్తాయో లేదోనన్న ఆందోళన వారిని వెంటాడుతోంది.ఒకవైపు వాతావరణ పరిస్థితులు, మరోవైపు కోతుల బెడదతో వ్యవసాయం భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పంటలను కాపాడుకోవడానికి పొలాల వద్ద కాపలా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, అయినప్పటికీ కోతుల నుంచి పంటలను పూర్తిస్థాయిలో రక్షించుకోలేకపోతున్నామని చెబుతున్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కోతుల బెడద నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కోతుల వల్ల పంటలకు జరుగుతున్న నష్టాన్ని పరిశీలించాలని కోరుతున్నారు.పంట పొలాల్లోకి కోతులు ప్రవేశించకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు,కోతుల నియంత్రణకు శాస్త్రీయ పద్ధతులను అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.కోతుల దాడులతో పంట నష్టపోయిన రైతులను గుర్తించి,నిబంధనల ప్రకారం పరిహారం అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరుతున్నారు.రైతులు తమ పంటలను కాపాడుకునే బాధ్యతను పూర్తిగా తమపైనే వేసుకోవాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు తగిన సహకారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.రైతు కష్టానికి రక్షణ లేదా.?పంట నష్టానికి పరిష్కారం ఏది.? అన్న ప్రశ్నలు ధారూర్ మండలంలో చర్చనీయాంశంగా మారాయి.రైతుల పంటను కాపాడటం అంటే రైతు కుటుంబ జీవనోపాధిని కాపాడటమేనని,ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే రైతులు మరింత ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయే ప్రమాదం ఉందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు తక్షణమే స్పందించి,కోతుల బెడద నుంచి రైతులకు విముక్తి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ప్రకృతి ప్రతికూలతలతో ఒకవైపు. కోతుల దాడులతో మరోవైపు రైతులు నష్టపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇకనైనా స్పందించి రైతుల పంటలను,ప్రజల జీవనోపాధిని కాపాడుతుందా.?అన్నది వేచి చూడాలి.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**కాప్రా, అక్టోబర్ 26 ( జనం సాక్షి ) :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని డాక్టర్ ఏఎస్ రావు నగర్ రౌండ్ బిల్డింగ్ వద్ద ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు హెల్ప్ డెస్క్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు .మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.పట్టభద్రుల ఓటరు నమోదు ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన అంశమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యావంతులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు.నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. హెల్ప్ డెస్క్‌ల ద్వారా నమోదు ప్రక్రియకు సంబంధించిన వివరాలను అందిస్తూ, అర్హులైన పట్టభద్రులకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన

### ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ పనితీరుపై వివరణ

### ఎఫ్ఐఆర్ నమోదు నుంచి లాకప్ వరకు పోలీస్ వ్యవస్థను వివరించిన సిబ్బంది



**ధారూర్,అక్టోబర్ 26(జనంసాక్షి)**విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు,పోలీస్ స్టేషన్ పనితీరు,ఫిర్యాదుల స్వీకరణ,కేసుల నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ధారూర్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను ప్రత్యక్షంగా చూపించి,విధులు, బాధ్యతలను పోలీస్ సిబ్బంది వివరించారు. పోలీస్ వ్యవస్థ ఎలా పనిచేస్తుంది,ప్రజల నుంచి ఫిర్యాదులు ఎలా స్వీకరిస్తారు,కేసు నమోదు చేసే విధానం ఏమిటి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డుల గది, కంప్యూటర్ విభాగం, స్టేషన్ రైటర్ గది,లాకప్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ గదిని విద్యార్థులకు చూపించారు.ఆయా విభాగాల్లో నిర్వహించే పనులు,కేసులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ,కంప్యూటర్ల ద్వారా వివరాలను నమోదు చేసే విధానం గురించి వివరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను స్వీకరించడం నుంచి వాటికి సంబంధించిన వివరాలను నమోదు చేయడం వరకు జరిగే ప్రక్రియను విద్యార్థులకు తెలియజేశారు.- తెల్ల కాగితంపై ఫిర్యాదు చేసినా స్వీకరిస్తాం.ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకమైన పత్రాలు తప్పనిసరి కాదని,తెల్ల కాగితంపై తమ సమస్యను రాసి సమర్పించినా ఫిర్యాదును స్వీకరిస్తామని పోలీస్ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు తమ సమస్యలను నిర్భయంగా పోలీసులకు తెలియజేయవచ్చని, ఫిర్యాదుల స్వీకరణకు సంబంధించిన విధానాలను ఈ సందర్భంగా వివరించారు. ప్రజలకు పోలీస్ శాఖ అందించే సేవలు, ఫిర్యాదుల ప్రాధాన్యత, కేసుల నమోదు ప్రక్రియ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.- ఎఫ్ఐఆర్‌లో 12 కాలాలు.ఒక్కో అంశంపై వివరణ.కేసు నమోదు ప్రక్రియలో కీలకమైన ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) గురించి స్టేషన్ రైటర్ హరీష్ విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. ఎఫ్ఐఆర్‌లో మొత్తం 12 కాలాలు ఉంటాయని, వాటిలో కేసుకు సంబంధించిన వివిధ వివరాలను నమోదు చేస్తారని వివరించారు. ప్రతి కాలంలో ఏయే వివరాలను పొందుపరుస్తారు,కేసు నమోదు సమయంలో సమాచారాన్ని ఎలా నమోదు చేస్తారు.అనే అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు.పోలీస్ స్టేషన్‌లో కేసులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ,కంప్యూటర్‌లో వివరాల నమోదు, రికార్డుల భద్రపరిచే విధానం గురించి కూడా తెలియజేశారు.- పోలీస్ వ్యవస్థపై అవగాహన పెంపొందించడమే లక్ష్యం.ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభించింది. పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించడం,పోలీసు సిబ్బంది విధులను తెలుసుకోవడం, ఫిర్యాదుల స్వీకరణ నుంచి కేసుల నమోదు వరకు జరిగే ప్రక్రియను అర్థం చేసుకోవడం ద్వారా విద్యార్థుల్లో పోలీస్ వ్యవస్థపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అనంతయ్య, రెడ్యా నాయక్,స్టేషన్ రైటర్ హరీష్,సబితతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై ఎన్నికల కమిషన్, ప్రభుత్వ నిర్లక్ష్యం

## నవంబర్ 6లోగా అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలి : తలసాని శ్రీనివాస్ యాదవ్

**అమీర్‌పేట, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంపై ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. నవంబర్ 6వ తేదీతో ఓటరు నమోదు గడువు ముగియనున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో తలసాని అధ్యక్షతన సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లలో పాదయాత్రలు నిర్వహిస్తూ ఇంటింటికీ వెళ్లి అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ఓటరు నమోదు బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలోనే ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) సైతం నియమించలేదని ఆరోపించారు. గత గ్రాడ్యుయేట్ ఎన్నికల సమయంలో హైదరాబాద్ నగర పరిధిలో 1.10 లక్షల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు కాగా, ప్రస్తుతం కేవలం 23 వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు. ఓటరు నమోదు పత్రాలను అధికారులకు అందజేస్తే అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ అసమర్థ పాలనతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తలసాని ఆరోపించారు. ముఖ్యమంత్రి పాలనను గాలికొదిలి ఇతర రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఓటరు నమోదు కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌చార్జి గోసుల శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, టి. మహేశ్వరి, అత్తిలి అరుణ గౌడ్, కుర్మ హేమలత, డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 2



ఓటరు నమోదు ఆలస్యంపై ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ వినతి

ఎస్ఐఆర్ ప్రక్రియలో లక్షలాది ఓట్ల తొలగింపునకు చర్యలు చేపట్టిన ఎన్నికల సంఘం, గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు విషయంలో మాత్రం బాధ్యతగా వ్యవహరించడం లేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఓట్ల తొలగింపు కోసం ఇంటింటికీ వెళ్తున్న బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించేందుకు మాత్రం చొరవ చూపడం లేదని ఆరోపించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో పార్టీ నాయకులు రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించేలా నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంగల్‌రావు నగర్ మాజీ కార్పొరేటర్ దేదీప్య, అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ నామ శేషుకుమారి పాల్గొన్నారు.





# నకిలీ కరెన్సీ నోట్లతో వ్యక్తి అరెస్ట్



**శంషాబాద్, అక్టోబర్26 (జనంసాక్షి) :** పాలమాకుల గ్రామంలోని పి-1 రోడ్డు సమీపంలో నకిలీ కరెన్సీ నోట్లను సరఫరా చేసేందుకు వచ్చిన సందీప్ (36)ను పెద్దషాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.500 విలువైన 240 నకిలీ నోట్లు, రూ.200 విలువైన 70 నకిలీ నోట్లు, ఒక ఆపిల్ ఐఫోన్, ఒక పోకో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. లిఖిత అనే మహిళ వద్ద డెలివరీ ఏజెంట్‌గా పనిచేస్తూ, నకిలీ నోట్లను సరఫరా చేస్తున్నట్లు విచారణలో నిందితుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పెద్దషాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వై. సురేందర్ రెడ్డి వెల్లడించారు.

# ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ఆందోళన



**శంషాబాద్,అక్టోబర్ 26(జనంసాక్షి) :** ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం శంషాబాద్ చౌరస్తాలో చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలను బీజేపీ నాయకులు ఖండించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు పతంగి రాజ్ భూపాల్ గౌడ్, బీజేపీ ఇంచార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్ యాదవ్, వై. శ్రీధర్, బొక్క బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 327 యూనియన్ ఐఎన్టియుసి 73వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** 327 యూనియన్ ఐఎన్టియుసి 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం రంగారెడ్డి జిల్లా జోనల్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి సైబర్ సిటీ సర్కిల్ అధ్యక్షులు కె. వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా పలువురితో కలిసి ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎన్టియుసి ట్రేడ్ యూనియన్ దశాబ్దాలుగా పోరాటం కొనసాగిస్తూనే ఉందని, ఈ క్రమంలో ఎంతోమంది సమస్యలను పరిష్కరించడంతోపాటు ఎన్నో కార్మిక కుటుంబాల జీవితాలలో వెలుగులు నింపడం జరిగిందన్నారు. ముమ్ముందు మరిన్ని పోరాటాల ద్వారా కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో జోనల్ కార్యాలయం తోపాటు బాలాజీ నగర్ సెక్షన్ ఆఫీస్ మరియు తారానగర్ సెక్షన్ కార్యాలయంనందు జెండా ఆవిష్కరణ మరియు పునాస మామిడి మొక్క నాటడం విశేషం. కూకట్పల్లి డివిజన్ సెక్రటరీ ఎస్. రమేష్, కొండాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ ఆర్. యాదయ్య, కొండాపూర్ డివిజన్ సెక్రెటరీ రాజేందర్ నాయక్, గచ్చిబౌలి డివిజన్ ప్రెసిడెంట్ ఎ. రాజేందర్, గచ్చిబౌలి డివిజన్ సెక్రెటరీ వై.వి. రామ్ రెడ్డి, గచ్చిబౌలి ట్రెజరర్ భరత్ భూషణ్, ఇబ్రహీం బాగ్ డివిజన్ ప్రెసిడెంట్ రమేష్, ఇబ్రహీం ట్రెజరర్ మహేష్, కార్మిక సోదరులు పాల్గొనడం జరిగింది.



# సిఎంసి ప్రజావాణి కార్యక్రమంలో కార్యాలయానికి 55 ఫిర్యాదులు




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భారీ సంఖ్యలో ఫిర్యాదుదారులు పాల్గొని 55 ఫిర్యాదులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు మాట్లాడుతూ సిఎంసి పరిధిలోని వివిధ ప్రాంతాలనుండి ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నేరుగా కార్పొరేషన్ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. కాగా ఇందులో ప్రధానంగా టౌన్ ప్లానింగ్ విభాగం నుండి 42, వెటర్నరీ విభాగం నుండి 01, ఇంజినీరింగ్ విభాగం నుండి 05, రెవెన్యూ(ప్రాపర్టీ టాక్స్) విభాగం నుండి 02, శానిటేషన్ విభాగానికి సంబంధించి 02, భూసేకరణ విభాగం నుండి 01, అర్బన్ బయోడైవర్సిటీ నుండి 01, అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ నుండి 01 ఫిర్యాదు అందినట్లు సిఎంసి అధికారులు వెల్లడించారు. స్వీకరించిన ప్రతి వినతికి ప్రత్యేక గ్రీవెన్స్ ఐడి మరియు ట్రాకింగ్ లింక్ కేటాయించడం జరిగిందని వారు తెలిపారు. తద్వారా ప్రజలు తమ ఫిర్యాదు పరిష్కార స్థితిని తెలుసుకునే అవకాశం కల్పించడంతోపాటు, ఫిర్యాదుల పరిష్కారాన్ని పారదర్శకంగా పర్యవేక్షించే విధానం అమలు చేస్తున్నారు. ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టి సకాలంలో పరిష్కరించడానికి నిబద్ధతతో పనిచేస్తామన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా కార్పొరేషన్ దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తుండడంతోపాటు ఫిర్యాదులపై క్రమబద్ధమైన పర్యవేక్షణ మరియు తదుపరి చర్యలకు వేదికగా కొనసాగుతోందని అధికారులు మీడియాకు వివరించారు.

**మియాపూర్ సర్కిల్ పరిధిలో...**

శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ సర్కిల్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అర్జీదారుల లేమితో వెలవెలబోయింది. కేవలం ముగ్గురు ఫిర్యాదుదారులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరై మూడు అర్జీలను అందించగా అందులో ఒకటి పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి, మరో రెండు ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులు ఉండడం గమనార్హం.

# కూకట్‌పల్లి కోర్టు బార్‌అసోసియేషన్ అధ్యక్షులుగా అడ్వకేట్ గోవర్ధన్ రెడ్డి



**శేరిలింగంపల్లి అక్టోబర్ 26 (జనంసాక్షి) :** కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షు లుగా సీనియర్ అడ్వకేట్ గోవర్ధన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో గోవర్ధన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టాలకు, న్యాయాలకు ఎంతో గొప్ప స్థానం ఉందని, ఆ ఔన్నత్యాన్ని మరింత ఇనుమడింపజేసేలా ముందుకు సాగుతామన్నారు. ప్రతి న్యాయవాదికి కోర్టులో సముచిత గౌరవం దక్కేందుకు తమ అసోసియేషన్ నిబద్ధతతో పని చేస్తుందని, న్యాయవాదుల సంక్షేమం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామన్నారు. ఈ క్రమంలో చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డికి న్యాయవాదిగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్ గౌడ్ తో కలిసి మెంబర్షిప్ ను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాదిగా పేద వర్గాలకు, న్యాయాన్ని కాపాడేందుకు నవతారెడ్డి సర్వశక్తులు ఒడ్డుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ జెండా మోసిన వాళ్లకు ప్రాధాన్యత ఎక్కడ ఉంది?



**పూడూర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** పూడూర్ మండలంలోని వివిధ గ్రామ ప్రజలు కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ జెండా మోసి కాంగ్రెస్ కోసం నిలిచిన వాళ్లకు గుర్తింపు లేదని వాళ్ల జీవితం అంకితం చేశామని అన్నారు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో జీవితాలు అర్పించిన నాయకులు ఇప్పుడు ఉన్న వాళ్ళ పరిస్థితి ఏమిటిది అని ప్రశ్నిస్తున్నారు కొత్తగా వచ్చిన వాళ్లకు ప్రాధాన్యత ఎక్కువ ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వాళ్లకు గుర్తింపు కరువవుతోంది అని కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు లేదని కాంగ్రెస్ పార్టీలో చోటు ఇవ్వటం లేదని పార్టీ కోసం ఏళ్ల తరబడి జెండా మోసిన నాయకులు అధికారం లేకున్నా పార్టీని విడకుండా కాంగ్రెస్ పార్టీకి కష్టపడిన కార్యకర్తలు చాలామంది ఉన్నారు అని వారు తెలిపారు కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశారు ఇప్పుడు పూడూర్ మండలంలో అసంతృప్తి తో ఉన్న నాయకులను ఏకతాటిపైకి తీసుకురాకుంటే రాబోయే రోజుల్లో నాయకులు చాలా ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని భావిస్తున్న పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు అదేవిధంగా సంతృప్తితో రాగిలిపోతామని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు ఇందులో కోడూరు మండల ఇతర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న తోటకూర వజ్రేష్ యాదవ్



**బోడుప్పల్-జనంసాక్షి :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ డివిజన్ ఇంద్రానగర్ కాలనీలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మకు కళ్యాణ్ కుమార్, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రదాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, జై రాములు, బి. సత్యనారాయణ యాదవ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఏ. రాములు తదితరులు పాల్గొన్నారు.

# అన్నసాగర్ శివారులో ఏడుగురు పేకాటరాయుళ్ల పట్టివేత

## పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు

## రూ. 9,750 నగదు స్వాధీనం

**కోట్‌పల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి):** కోట్‌పల్లి మండలంలోని అన్నసాగర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం కోట్‌పల్లి ఎస్ఐ ఎం. మీనాక్షికి అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పేకాట ఆడుతున్న ప్రకాష్ (తండ్రి మల్లయ్య), దస్తగిరి (తండ్రి గోరెమియా), శంకర్ లక్ష్మప్ప (తండ్రి చింతలయ్య), అంజయ్య (తండ్రి లక్ష్మయ్య), అంజప్ప (తండ్రి రాములు), రాములు (తండ్రి లింగయ్య) సహా ఏడుగురిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి మొత్తం రూ. 9,750 నగదును స్వాధీనం చేసుకున్నారు.

# పంచవటి కాలనీలో భూముల హద్దులపై అధికారుల సర్వే



**రాజేంద్రనగర్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** ప్రభుత్వ భూముల ఆక్రమణ ఆరోపణల నేపథ్యంలో మణికొండ పంచవటి కాలనీ కమాన్ సమీపంలోని సర్వే నంబర్లు 41, 42లో రెవెన్యూ అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 42లో సుమారు 12 గుంటల స్థలాన్ని ఓ బిల్డర్ ఆక్రమించారనే ఆరోపణలు రావడంతో అధికారులు భూమిని పరిశీలించి హద్దులను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. ఈ సర్వేలో ఆర్ఐ సురేష్, , సర్వేయర్ బావోతు అంబర్ సింగ్‌తో పాటు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**సర్వే నంబర్ 42లో ప్రభుత్వ భూమిగా గుర్తింపు**

సర్వే నంబర్ 42లోని స్థలంలో అధికారులు హద్దు రాళ్లు పాతి ప్రభుత్వ భూమిగా గుర్తించారు. అయితే ఈ విషయంపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది.

# మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్

## హర్యానా రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన

## భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ ప్రత్యేకత : సత్య ప్రసాద్




**బోడుప్పల్-జనంసాక్షి :** వివిధ రాష్ట్రాల సంస్కృతులు, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించే లక్ష్యంతో మేడిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. సత్య ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హర్యానా రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, కళలు, అక్కడి ప్రజల ఆచార వ్యవహారాల గురించి విద్యార్థులకు వివరించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య ఉన్న సాంస్కృతిక సంబంధాలను తెలియజేస్తూ, భిన్న ప్రాంతాల ప్రజల జీవన విధానాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించడంతో వారు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎల్. సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతులు, సంప్రదాయాలపై ప్రత్యక్ష అవగాహన కలుగుతుందని తెలిపారు. వివిధ రాష్ట్రాల ప్రత్యేకతలను తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో పరస్పర గౌరవం, సోదరభావం, జాతీయ సమైక్యతా భావం పెంపొందుతాయని పేర్కొన్నారు. భాషలు, ఆచారాలు, సంప్రదాయాలు వేరైనా భారతీయులందరూ ఒక్కటేననే సందేశాన్ని ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం చాటిచెబుతుందని ఆయన అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ స్ఫూర్తిని విద్యార్థులు ఆచరణాత్మకంగా అర్థం చేసుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యతా భావంతో పాటు ఇతర రాష్ట్రాల సంస్కృతుల పట్ల గౌరవాన్ని పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలిచిందని పేర్కొన్నారు.





# ఎర్రజెండా దివిటీలు...

**ఆశయాల బాటలో మొదటి అడుగు..**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, మహేశ్వరం , కందుకూరు ప్రాంతాలు భూస్వామ్య దొర్జన్యాలకు, పీడనకు నిలయాలుగా ఉన్న రోజుల్లో... ఆ అన్యాయాలను చూసి రగిలిపోయిన గుండెలు వారివి. మంచాల మండలం జాపాల గ్రామంలో మహబూబ్ పాషా జన్మించారు. చిన్ననాటి నుంచే సమాజంలో ఉన్న అసమానతలను ప్రశ్నించారు. సిపిఐ(ఎం) సిద్ధాంతాలకు ఆకర్షితులై, ఎర్రజెండానే పేదల కష్టాలకు ఏకైక శరణ్యమని నమ్మి ఊరూరా ఉద్యమ బావుటా ఎగురవేశారు. ఇదే తరుణంలో మంచాల మండల పరిషత్ ఎంపీపీగా ఎన్నికైన కామ్రేడ్ నరహరి ప్రజా ఉద్యమాల్లో మణికమయ్యారు. పాషాతో తోడబుట్టిన సోదరునిలా అడుగులో అడుగేస్తూ, పల్లెపల్లెనా రైతాంగాన్ని, వ్యవసాయ కార్మికులను చైతన్య పరిచారు. నిరంతరం ప్రజల్లోనే ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామి అయ్యారు.

**సమర సభలు... సాహస పోరాటాలు..**

భూపోరాటాలు, ఇంటి జాగల ఉద్యమాలు, పోరంబోకు భూముల సాధనలలో ఈ ఇద్దరు యోధులు చూపిన సాహసం అపూర్వం. భూస్వామ్య శక్తులు, కక్షసాధింపు రాజకీయాలు ఎంతటి బెదిరింపులకు దిగినా అంగుళం కూడా వెనక్కి తగ్గలేదు. "నేల మనది... నీరు మనది... ఈ మట్టిపై సర్వహక్కులూ ఉపాధి పొందే పేదలదే" అని గర్జిస్తూ వేలాది ఎకరాల భూములను నిరుపేదలకు దక్కేలా చేసిన ప్రజా నాయకులు వీరు.

**మృత్యువును జయించిన అమరత్వం..**

ప్రజా సంక్షేమమే ఊపిరిగా, ఎర్రజెండా ఆశయాలే జీవితంగా నడుస్తున్న ఆ విప్లవ ప్రస్థానాన్ని చూసి ఓర్వలేని భూస్వామ్య కుట్రదారులు, ప్రత్యర్థులు వీరిని నమ్మకద్రోహంతో పొట్టనబెట్టుకున్నారు. 1989 అక్టోబర్ 26 న మంచాల మండలం లింగంపల్లి గేట్ వద్ద దారి కాచి హత్య చేశారు. కానీ, విప్లవకారుడి శరీరాన్ని మాత్రమే హత్య చేయగలరు... వారు రగిల్చిన ఉద్యమ జ్వాలను, ఆశయాలను ఏ శక్తి ఆపలేదని నిరూపిస్తూ కామ్రేడ్ పాషా, నరహరి అమరులయ్యారు.

**గుండెల నిండా జ్ఞాపకం... ప్రతి అడుగులో ఉద్యమం**

నేటికీ ఇబ్రహీంపట్నం గడ్డపై వినిపించే ప్రతి విప్లవ గేయంలో, బుర్రకథలో పాషా-నరహరిల వీరగాథలు ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. వారు చిందించిన రక్తం వృథా పోలేదు. సమాజంలో దోపిడీ, అన్యాయం అంతమయ్యే వరకు వారు చూపిన పోరాట బాట నిరంతరం వెలుగునిస్తూనే ఉంటుంది. అమరులు కామ్రేడ్ పాషా, నరహరిల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికిర్పించే అత్యున్నత నివాళి. "మరణం వారి శరీరాన్నే తీసుకెల్లింది.. కానీ వారు రగిల్చిన ఎర్రజెండా విప్లవ జ్వాల పేదల గుండెల్లో నిరంతరం వెలుగుతూనే ఉంటుంది".

## సీసీ రోడ్డు, వరద నీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలించిన కళ్లెం నవజీవన్ రెడ్డి



హయత్‌నగర్, అక్టోబర్ 26 (జనం సాక్షి) : హైకోర్టు కాలనీ డివిజన్ పరిధిలోని ఆటో సాయినగర్ నుంచి ద్వారకామై నగర్ మీదుగా హైకోర్టు కాలనీ వరకు చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు, వరద నీటి కాలువ నిర్మాణ పనులకు సంబంధించి మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అధికారులతో కలిసి లెవెల్స్‌ను పరిశీలించారు. ద్వారకామై నగర్ ప్రధాన రహదారిపై సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు, వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా 600 ఎంఎం వ్యాసం కలిగిన పైప్‌లైన్‌తో వరద నీటి కాలువ నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదించిన పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు నిర్మాణం, వరద నీటి పారుదల వ్యవస్థ పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులతో చర్చించారు. ఈ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు రాకపోకలతో పాటు వర్షపు నీటి పారుదల సమస్యల నుంచి ఉపశమనం లభించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్, ఏఈ విగ్నేశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పార్కు స్థలంలో బోరు పనులు నిలిపివేత

రాజేంద్రనగర్, అక్టోబర్ 26 (జనంసాక్షి): తిరుమల హిల్స్‌లోని 6,054 గజాల పార్కు స్థలంలో బోరు పనులు చేపట్టడంపై 'జనం సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న రెవెన్యూ అధికారులు బోరు పనులను నిలిపివేశారు. హైడ్రా అధికారులు సైతం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీంతో స్పందించిన రెవెన్యూ, హైడ్రా అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రభుత్వ స్థలంలో అనుమతులెలా ఇచ్చారు?**

తిరుమల హిల్స్‌లోని పార్కు స్థలంపై వివాదం కొనసాగుతుండగా, అక్కడ బోరు పనులు చేపట్టడంపై కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పార్కు స్థలం ప్రభుత్వానికి చెందినదైతే, అక్కడ నిర్మాణాలు లేదా ఇతర పనులకు అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా, వివాదాస్పద స్థలంలో సీఎంసీ అధికారులు స్టిల్ట్ ప్లస్ టూ నిర్మాణానికి అనుమతులు ఎలా మంజూరు చేశారనే అంశంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతుల జారీపై సమగ్ర విచారణ జరిపి, పార్కు స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ధర్నా

**మొయినాబాద్ తహసీల్దార్కు వినతి పత్రం అందజేస్తూ..**



మొయినాబాద్,అక్టోబర్26, జనంసాక్షి: : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుపరచాలని సోమవారం మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతాంగాన్ని మోసం చేస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ.. సమస్యల పరిష్కారానికై భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో మొయినాబాద్ తహశీల్దార్ గౌతమ్ కుమార్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం భారతీయ కిసాన్ సంఘ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన రైతులందరికీ ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీని వడ్డీతో సహా అమలు చేసి ఖాతాల్లో జమ చేయాలని, నిరంతరాయంగా 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అన్ని వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరకు అదనంగా రూ. 500 బోనస్ చెల్లించాలని, మూడేళ్ల రైతుభరోసా బకాయిలను కౌలు రైతులతో కలిపి ఎకరాకు రూ. 45,000 తక్షణమే చెల్లించడంతో పాటు భూమిలేని రైతు కూలీలకు రూ. 36,000 ఆర్థిక సాయం అందించాలని కోరారు. రైతుబీమాను రూ. 10 లక్షలకు పెంచాలని, పట్టా భూములను 22 ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి పోడు, అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కేంద్రం ప్రారంభం

- అర్హులైన గ్రాడ్యుయేట్లు నవంబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోవాలి
- మండల అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్ సాగర్



బొంరాస్ పేట, అక్టోబర్ 26 (జనం సాక్షి): హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల పరిధిలోని తుంకీమెట్ల గ్రామంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కేంద్రాన్ని సోమవారం మండల అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్ సాగర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు నవంబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సిహెచ్ నర్సింలు, సీనియర్ నాయకులు నాగురావు, ఎమ్మెల్సీ ఎన్నికల మండల ఇన్చార్జిలు ముకుందం, రాజు నాయక్, శ్రీనివాస్, అంజయ్య, నారాయణ గౌడ్, ఉప్పు జగదీశ్వర్, రాజారాంరెడ్డి, రఘునాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.







# ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ ఉద్యమం

- రంగరాజన్ మోహన్ కుమార మంగళం డిమాండ్ చేశారు
- ఓట్ల తొలగింపుపై సమగ్ర విచారణ జరపాలి..
- నవంబర్ 1న ఢిల్లీ సభను విజయవంతం చేయాలి
- తోటకూర వజ్రేష్ యాదవ్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (జనంసాక్షి) : ఓటు చోరీ అనేది ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకే పరిమితమైన సమస్య కాదని, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనానికి సంబంధించిన విస్తృత అంశమని ఏఐసీసీ పరిశీలకుడు రంగరాజన్ మోహన్ కుమార మంగళం అన్నారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు దక్కాలని, ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలని పేర్కొన్నారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'ఓటు బచావో-దేశ్ బచావో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం బోడుప్పల్‌లో డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ కోఆర్డినేటర్ అప్సర్ యూసఫ్ జాహీతో కలిసి ఆయన మాట్లాడారు. మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పర్యటనలో భాగంగా పార్టీ సంస్థాగత బలోపేతం, ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై పార్టీ నాయకులతో చర్చించినట్లు తెలిపారు.

**ఓటర్ల జాబితాల్లో అక్రమాలపై విచారణ జరపాలి**

ఓటర్ల జాబితాల్లో పేర్ల చేర్పులు, తొలగింపులు, అనుమానాస్పద నమోదులపై సమగ్ర విచారణ జరపాలని రంగరాజన్ మోహన్ కుమార మంగళం డిమాండ్ చేశారు. 2018లో మధ్యప్రదేశ్ ఎన్నికల్లో ఏడు లక్షల ఓట్లు తొలగించారని ఆరోపించారు. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, హర్యానా రాష్ట్రాల్లోనూ ఓట్ల చోరీ జరిగిందని, ఈ అంశాలపై సమగ్ర పరిశీలన అవసరమని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలకు సంబంధించిన సమాచారాన్ని పారదర్శకంగా అందుబాటులో ఉంచడంతోపాటు, ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరుపై ప్రజలకు విశ్వసనీయత కల్పించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణపై సందేహాలు కొనసాగితే ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతింటుందని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలో ఓటర్ల సంఖ్య పెరుగుదల, కర్ణాటకలోని మహదేవపుర నియోజకవర్గంలో ఓటర్ల నమోదుపై కాంగ్రెస్ లేవనెత్తిన అంశాలను ప్రస్తావించారు. ఓటర్ల జాబితాల్లోని అనుమానాస్పద నమోదులను స్వతంత్రంగా ధ్రువీకరించుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, కమిషనర్ల నియామక విధానం, అధికారుల జవాబుదారీతనంపై స్పష్టత అవసరమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి**

**తోటకూర వజ్రేష్ యాదవ్**

నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓటు బచావో-దేశ్ బచావో' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు కాపాడటమే లక్ష్యంగా చేపట్టిన ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమంత్ రెడ్డి, సీనియర్ నాయకులు భూపతి రెడ్డి, బాల్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, యు. సత్యనారాయణ, నవీన్ రెడ్డి, సురేందర్ ముదిరాజ్, రాజేష్, శంకర్ గౌడ్, తుంకి రమేష్, విజయ్ రెడ్డి, రాములు, మహిళా నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## ఈటల పాదయాత్రకు బీజేపీ శ్రేణులు తరలిరావాలి

### కీసర డివిజన్ నాయకులు, కార్యకర్తలకు పిలుపు

**కీసర, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం మంగళవారం నుండి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేపడుతున్న పాదయాత్రకు కీసర డివిజన్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి మద్దతు తెలపాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పార్టీ సూచన మేరకు సోమవారం కీసర పెద్దమ్మ దేవాలయ ప్రాంగణంలో డివిజన్ అధ్యక్షుడు బాలరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం చేపడుతున్న పాదయాత్రకు పార్టీ శ్రేణులంతా సంఘటితంగా మద్దతు తెలపాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చేపట్టే ఉద్యమాల్లో నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాదయాత్రను విజయవంతం చేసేందుకు కీసర డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## మధురానగర్‌లో కుళ్లిన మృతదేహం లభ్యం

### మృతుడు నేపాల్‌కు చెందిన రమేష్‌గా అనుమానం

### ముగ్గురు స్నేహితులు పరారీ

**అమీర్‌పేట/మధురానగర్ (జనంసాక్షి):** మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణపతి కాంప్లెక్స్ వెనుక ఉన్న పెంట్‌హౌస్‌లో కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యమైంది. దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు నేపాల్‌కు చెందిన రమేష్‌గా పోలీసులు అనుమానిస్తున్నారు. అతనితో కలిసి నివసిస్తున్న ముగ్గురు స్నేహితులు పరారీలో ఉన్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# కాలనీల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి

### ముప్పా రామారావు • రూ.32 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి



**కీసర, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావు అన్నారు. డివిజన్‌లోని సాయిసురక్ష, ఆదిత్యనగర్ కాలనీల్లో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు.

**రూ.32 లక్షలతో రోడ్ల నిర్మాణం**

15వ వార్డు సాయిసురక్ష కాలనీలో రూ.21 లక్షల వ్యయంతో 5 మీటర్ల వెడల్పు, 175 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మించారు. అలాగే 7వ వార్డు ఆదిత్యనగర్ కాలనీలో రూ.11 లక్షలతో 4.2 మీటర్ల వెడల్పు, 90 మీటర్ల పొడవున సీసీ రోడ్డు పనులు చేపట్టారు. మొత్తం రూ.32 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ రోడ్లతో స్థానికులకు రాకపోకలు సులభతరం కానున్నాయి. ఈ కార్యక్రమాల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, సామాల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీలతరామారావు, శ్రవణ్‌రెడ్డి, యాదగిరి గౌడ్, సంజీవరెడ్డి, గౌస్, ప్రసాద్‌గౌడ్, బండి యాదగిరి, పెర్ల విజయ్‌కుమార్, ఓజల్, రాజేశ్, సంజీవ్, జగన్, సుధాకర్‌గౌడ్, సుమేశ్, గోవర్ధన్, చంద్రయ్యతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.



# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### హైదరాబాద్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ • వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

**హైదరాబాద్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం నాంపల్లి క్లస్టర్ పరిధిలోని అఫ్జల్‌సాగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, ప్రయోగశాల, వివిధ రికార్డులు, పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలు, వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సమీక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్ని రకాల మందులను ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.



**టీకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

ఈ నెల 23 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న క్యాచ్ అప్ క్యాంపెయిన్ ద్వారా టీకాలు తీసుకోని, అసంపూర్తిగా టీకాలు పొందిన పిల్లలను గుర్తించి వందశాతం వ్యాక్సినేషన్ లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. వ్యాక్సిన్ల నిల్వ, శీతలీకరణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అర్హులైన బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేయించాలని, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కోరారు.

**వ్యాధుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి**

వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగనున్న కుష్ఠు వ్యాధి గుర్తింపు కార్యక్రమంలో ఫీల్డ్ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి అనుమానిత కేసులను గుర్తించి, అవసరమైన చికిత్స అందేలా చూడాలన్నారు. నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల సర్వే, స్క్రీనింగ్, ఫాలోఅప్ ప్రతిరోజూ నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలని, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. ఈ పర్యటనలో నాంపల్లి క్లస్టర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మురళీధర్‌తో పాటు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.



# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**మమత క్లినిక్ సీజ్ చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ కె. ఆనంద్ • అనుమతులు లేకుంటే వైద్య కేంద్రాల సీజ్**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యమని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ స్పష్టం చేశారు. అవసరమైన అనుమతులు లేకుండా వైద్య కేంద్రాలు నిర్వహించినా, అర్హతలు లేని వ్యక్తులు వైద్య సేవలు అందించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, బోడుప్పల్ ప్రాంతాల్లో డీఎంహెచ్ఓ డాక్టర్ కె. ఆనంద్ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, పీసీపీఎన్‌డీటీ చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తనిఖీల్లో భాగంగా రామంతాపూర్‌లోని శ్రీ గాయత్రి కేంద్రాన్ని పరిశీలించి, పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించడంతోపాటు చట్టబద్ధమైన విధానాలను అనుసరించాలని ఆదేశించారు. ఉప్పల్‌లోని యూవీ డయాగ్నస్టిక్ సెంటర్‌లోనూ తనిఖీలు నిర్వహించి, కేంద్రం నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. బోడుప్పల్‌లోని మమత క్లినిక్‌ను తనిఖీ చేయగా, అవసరమైన రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్నట్లు, క్లినిక్ నిర్వహిస్తున్న వ్యక్తికి అవసరమైన అర్హతలు లేనట్లు అధికారులు గుర్తించారు. దీంతో నిబంధనల ప్రకారం క్లినిక్‌ను తక్షణమే సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో కె.ఆనంద్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లు, అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, సంబంధిత చట్ట నిబంధనలను పాటించాలన్నారు. ఉల్లంఘనలను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు, పర్యవేక్షణ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో కీసర డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత, జిల్లా ఎంసీహెచ్/సీఐఎ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ గీత, అదనపు ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ పవన్ రెడ్డి, డిప్యూటీ డెమో వసంత కుమారి పాల్గొన్నారు.



# ప్రజా పోరాటానికి ప్రజలంతా కదలిరండి

**బీజేపీ మీడియా కన్వీనర్ చల్వాది ప్రవీణ్ రావు**

**జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యల పరిష్కారానికి ఈటల పాదయాత్ర**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యల పరిష్కారం కోసం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టనున్న పాదయాత్రకు ప్రజలంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంఘీభావం తెలపాలని బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా మీడియా కన్వీనర్ చల్వాది ప్రవీణ్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం ఎదులాబాద్ గ్రామంలోని శ్రీ మురంగానాయక స్వామి ఆలయం నుంచి జవహర్‌నగర్ డంపింగ్ యార్డు వరకు పాదయాత్ర ప్రారంభం కానుందని తెలిపారు. డంపింగ్ యార్డు కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కాలుష్యం, దుర్వాసన, పర్యావరణ సమస్యలపై దృష్టి సారించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ప్రవీణ్ రావు పేర్కొన్నారు. ఈ సమస్యలు ప్రజల ఆరోగ్యంపై చూపుతున్న ప్రభావాల నేపథ్యంలో చేపడుతున్న పాదయాత్రలో యువత, మహిళలు, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాలని, ప్రజల గళాన్ని వినిపించే ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని ప్రవీణ్ రావు పిలుపునిచ్చారు.




# డంపింగ్ యార్డు తరలించే వరకు పోరాటం

- నేటి నుంచి ఈటల రాజేందర్ మహా పాదయాత్ర
- నాలుగు రోజుల్లో 60 కిలోమీటర్ల ప్రయాణం
- జవహర్‌నగర్ కాలుష్య బాధితులకు అండగా ప్రజా ఉద్యమం
- 30న భారీ బహిరంగ సభ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యపై ప్రజా పోరాటానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శ్రీకారం చుట్టనున్నారు. డంపింగ్ యార్డు కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కాలుష్య సమస్యలు, ఆరోగ్యపరమైన ఇబ్బందులను వెలుగులోకి తీసుకురావడంతోపాటు యార్డు తరలింపు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే లక్ష్యంతో మంగళవారం నుంచి నాలుగు రోజుల మహా పాదయాత్ర చేపట్టనున్నారు. సుమారు 60 కిలోమీటర్ల మేర సాగే ఈ యాత్ర అక్టోబర్ 30న జవహర్‌నగర్‌లో జరిగే భారీ బహిరంగ సభతో ముగియనుంది. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, బాధిత ప్రాంతాల ప్రజలకు న్యాయం చేయాలని బీజేపీ ఈ పాదయాత్ర ద్వారా డిమాండ్ చేయనుంది.

**చెరువు సందర్శనతో ప్రారంభం**

మంగళవారం ఉదయం ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణ చెరువు వద్ద పాదయాత్ర ప్రారంభం కానుంది. తొలుత ఎంపీ ఈటల రాజేందర్ చెరువును సందర్శించి, పరిసర ప్రాంతాల ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోనున్నారు. అనంతరం మర్రిపల్లిగూడెం, చందుపట్లగూడ, ఎన్ఎఫ్‌సీ నగర్, బొక్కనిగూడెం, ఘనపురం మీదుగా అన్నోజిగూడకు చేరుకోనున్నారు. తొలిరోజు సుమారు 14 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగనుండగా, రాత్రికి అన్నోజిగూడలో బస చేయనున్నారు.

**నాలుగు రోజుల యాత్ర ఇలా..**

తొలిరోజు.. 27న ఎదులాబాద్, మర్రిపల్లిగూడెం, చందుపట్లగూడ, ఎన్ఎఫ్‌సీ నగర్, బొక్కనిగూడెం, ఘనపురం మీదుగా అన్నోజిగూడ. రెండో రోజు.. 28న అన్నోజిగూడ, ఘట్‌కేసర్, యమ్నంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, రాంపల్లి, కరీంగూడ, రాంపల్లి దాయరా మీదుగా కీసర. రాత్రికి మేఘనా కన్వెన్షన్‌లో బస. మూడో రోజు.. 29న కీసర, చీర్యాల, గృహకల్ప, బండ్లగూడ చౌరస్తా, రాంపల్లి చౌరస్తా మీదుగా యాత్ర కొనసాగుతుంది. రాత్రికి రాంపల్లి చౌరస్తా వద్ద బస. నాలుగో రోజు..30న నాగారం, దమ్మాయిగూడ మీదుగా జవహర్‌నగర్‌కు చేరుకుంటారు. అక్కడ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు.






**ప్రజల ఆరోగ్యం.. పర్యావరణ పరిరక్షణే లక్ష్యం**

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే పాదయాత్ర ప్రధాన ఉద్దేశమని బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. డంపింగ్ యార్డు తరలింపు, ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.

**పాదయాత్రను జయప్రదం చేయండి**

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు శాశ్వత తరలింపు కోసం చేపడుతున్న మహా పాదయాత్రలో బాధిత ప్రజలు, ప్రజాసంఘాలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. బీజేపీ మీడియా కన్వీనర్ చల్వాది ప్రవీణ్ రావు సైతం పాదయాత్రకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు.